ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
మంగళవారం | 17 ఫిబ్రవరి, 2026 | పేజీలు : 08

## గందరగోళ పరిస్థితులు: ఎన్నిక వాయిదా: గోపిరాం



**ప్రజాపక్షం/జనగామ :** గందరగోళ పరిస్థితుల నేపద్యంలోనే జనగామ మున్సిపల్ ఎన్నిక వాయిదా వేశామని ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి, జనగామ ఆర్‌డిఓ గోపిరాం తెలిపారు. జనగామ మున్సిపల్ ఎన్నికల్ని వాయిదా వేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించడం జరిగిందని, ఛైర్మన్ ఎన్నికకు సిద్ధమైన క్రమంలో ఒక కౌన్సిలర్‌పై కిడ్నాఫ్ కేసు నమోదైనందున విచారణ జరిపించాలని, అప్పటి వరక వాయిదా వేయాలని కోరుతూ ధర్నా చేయడం, ఎన్నిక నిర్వయించడానికి సరియైన వాతావరణం లేకపోవడంతో వాయిదా వేయడం జరిగిందన్నారు. మంగళవారం ఎన్నికల నిర్వయిస్తామని తెలిపారు.

# తొర్రూరు మున్సిపల్ చైర్మన్ ఎన్నిక వాయిదా!

**ప్రజాపక్షం/తొర్రూరు :** మున్సిపాలిటీలో మొత్తం 16 వార్డులకు గాను బీఆర్ఎస్ పార్టీ తొమ్మిది వార్డులు, కాంగ్రెస్ పార్టీ ఏడు వార్డులను తొర్రూరు మున్సిపల్ ఎన్నికల్లో గెలుచుకుంది. వాస్తవానికి ఎవరికి మెజారిటీ ఉంటే వారికే మున్సిపల్ చైర్మన్ పదవి దక్కాల్సి ఉంది. కాని కాంగ్రెస్ ఎంపీ కడియం కావ్య, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఎక్స్ అఫిషియో సభ్యులుగా పేర్లు నమోదు చేసుకోవడంతో కాంగ్రెస్ పార్టీకి బలం కూడా తొమ్మిదికి పెరిగింది. దీంతో డ్రా ద్వారా చైర్మన్‌ను, వైస్ చైర్మన్‌ను ఎన్నుకునే పరిస్థితి ఏర్పడింది. కాగా కడియం కావ్య గతంలో వరంగల్ కార్పొరేషన్‌లో కూడా ఎక్స్ అఫిషియో మెంబర్ తన పేరును నమోదు చేసుకున్నారు. ఇప్పుడు కూడా తొర్రూరులో ఎక్స్ అఫిషియో మెంబర్‌గా పేరు నమోదు చేసుకోవడంపై బీఆర్ఎస్ నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. వరంగల్ కార్పొరేషన్‌లో ఎక్స్ అఫిషియో సభ్యురాలిగా ఉన్న ఆమె ఇప్పటికప్పుడు తొర్రూరులో ఎక్స్ అఫిషియో మెంబర్‌గా పేరును ఎలా నమోదు చేసుకుంటారని ప్రశ్నిస్తున్నారు. దీనిపై బీఆర్ఎస్ నేతలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో అధికారులు తొర్రూరు మున్సిపల్ చైర్మన్ ఎన్నికను మంగళవారంకు వాయిదా వేశారు.




### మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా

## కాళేశ్వరం క్షేత్రానికి పోటెత్తిన భక్తులు



**ప్రజాపక్షం/కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగిన మహాశివరాత్రి ఉత్సవాలు సోమవారం రాత్రి 8 గంటలకు నాకబలి, నందివాహన సేవ,పవళింపు సేవతో ఉత్సవాలు ముగిసాయి.మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ఆదివారం కాళేశ్వర క్షేత్రంలో వివిధ ప్రాంతాల నుండి భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో క్షేత్రంలోఆధ్యాత్మిక సందడిగా మారింది. వివిధ ప్రాంతాల నుండి కాళేశ్వరం క్షేత్రానికి భక్తులు పోటెత్తడంతో త్రివేణి సంగమ తీరంలో పుణ్య స్నానాల భక్తులతో జన సంద్రంగా మారగా, ఆలయానికి భక్తుల తాకిడి పెరిగి ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోగా, ఆలయ ప్రాంగణమంతా భక్తుల శివనామస్మరణతో మారుమోగాయి.క్షేత్రంలో భక్తుల రద్దీ పెరిగి ఆధ్యాత్మిక సందడిగా మారింది. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆలయంలో సాయంత్రం శుభానంధ, ముక్తీశ్వరుల స్వామి వారి కళ్యాణ మహోత్సవం వేడుకలు భక్తులకు కమనీయంగా మారి కన్నుల పండువగా మారగా, సరస్వతి పుష్కర ఘాట్ తీరం వద్ద రాత్రి 7 గంటలకు నిర్వహించిన గోదావరి హారతి కార్యక్రమం భక్తులను మంత్ర ముగ్ధులను చేసింది. త్రివేణి సంగమ తీరంలో రాత్రి 8 గంటలకు ఏర్పాటు చేసిన తెప్పోత్సవం కార్యక్రమంలో భాగంగా స్వామి వారి ఉత్సవమూర్తులను హంస వాహనంపై ఊరేగింపు కార్యక్రమం నేత్రపర్వంగా భక్తులు తన్మయత్వానికి గురయ్యారు. ఆలయంలో అర్ధరాత్రి 12 గంటలకు నిర్వహించిన స్వామి వారి లింగోద్భవ పూజల్లో పాల్గొన్న భక్తజనం భక్తిపారవశ్యంతో ఆధ్యాత్మిక తన్మయత్వంలో మునిగి తేలారు.



### జాతరలో హోరెత్తిన

## బండ్ల ఊరేగింపు



**ప్రజాపక్షం/పాపన్నపేట:** ఏడుపాయల వనదుర్గా భవాని క్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండ రోజైన సోమవారం జాతరలో ప్రధాన ఘట్టమైన జాతర బండ్ల ఊరేగింపు కనుల పండుగగా సాగింది. శకట బ్రహ్మోత్సవం (గుమ్మటాల బండ్లు) ఎడ్లబండ్ల ఊరేగింపు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఈ ఊరేగింపును తిలకించడానికి లక్షలాది భక్తులు పోటెత్తారు. దీంతో అమ్మ వారిక్షేత్రం వనమంతా జనంతో కిక్కిరిసింది. బండ్ల ఊరే గింపు శివసత్తుల శిగాలు పోతరాజుల నృత్యాలు, డప్పు చప్పుళ్లకు అనుగుణంగా యువ కుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. భక్తులు అమ్మవారికి ఒడిబియ్యాలు, తలనీలాలు బోనాలు, సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాలు తీసే మ హిళలు చేసే కళాత్మక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఏడుపాయల భక్తులతో గుట్ట లన్నీ నిండిపోయి ఎటు చూసినా కిలోమీటర్ల కొద్దీ యాత్రికులు కనిపిస్తున్నారు. ఏడుపాయల చుట్టూరా ఉన్న కొండ కోనలు చిట్టడవి, మంజీర నదీపాయలు, మం జీర సెలయేరు వనదుర్గా మాత ఏర్పా టు చేసుకున్న ప్రకృతి రమణీయదృశ్యాలు భక్తుల మనసులను దోచుకున్నాయి.

**అట్టహాసంగా జాతర బండ్ల ఊరేగింపు**

జాతరలో రెండవ రోజు ప్రధాన ఘట్టమైన బండ్ల ఊరే గింపు శివసత్తులుపూనకాలతో శిగాలుగుతుండగా శకట బ్రహ్మోత్సవం ప్రారంభమైంది. ఆనవాయితీ ప్రకారం మొట్టమొదటగా పాపన్నపేట సంస్థానాధీశుల తరపు పాపన్నపేట వారి బండి. ముందు తిరగగా వెనుక వందలాది ఎడ్ల బండ్లు వాటిని అనుసరించాయి. సంస్థానాధీశుల బండికి ఆలయ ఈఓ వీరేశం., పోలీస్, రెవెన్యూ శాఖ అధికా రులు కొబ్బరి కాయలు కొట్టి బండ్ల ఊరేగింపు కార్యక్ర మాన్ని ప్రారంభించారు. డప్పు మోతలకనుగుణంగా జోగిని నృత్యాల మధ్య బండ్ల ఊరేగింపు జరిగింది.

**ఆకట్టుకున్న అమ్మవారి అలంకరణ**

ఏడుపాయల జాతర మహా ఉత్సవాలలో అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ గర్భగుడి పూలతో అలంకరింగా అమ్మవారు బంగారు కిరీటం, బంగారు ఆభరణాలు, పట్టు వస్త్రలతో భక్తులకు దర్శనమిచ్చింది.

**ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శన**

జిల్లా సమాచార శాఖ ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కా ర్యక్ర మాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆదివారం రాత్రి డిపిఆర్ఓ రామచంద్ర రాజ్, ఆలయ ఈవో వీరేశం, జాతర స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్ తదితరులు జ్యోతి ప్రజలను చేసి సంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. జానపద కళాకారులు, తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకా రులు, భరతనాట్యం తదితర ఆటపాటలతో వేదిక పైన నృత్యాలతో భక్తు లను అలరించారు.

**ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేస్తూ**

ఏడుపాయల జాతరకు లక్షలాదిగా వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో, మెదక్ డిఎస్పి ప్రసన్నకుమార్ జాతరలో పర్యటిస్తూ వివిధ శాఖల అధికారులను సమన్వయం చేస్తూ తగిన సూచనలు చేస్తున్నారు.

**బోనాలతో హోరెత్తించిన శివసత్తులు**

శివసత్తుల సిగాలు పోతరాజుల విన్యాసాలు జాతరలో ఎటు చూసినా పోతరాజుల విన్యాసాలు శివస తుల శిగాలు ఊగుతూ అమ్మవారికి భక్తులు బోనాల సమర్పించారు. డప్పు చప్పులకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ బోనాలు ఊరేగింపుగా తీసుకెళ్లారు.

## ప్రజావాణి దరఖాస్తుల సమస్యలపై పరిష్కారం



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** ప్రజావాణి దరఖాస్తుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి(గ్రీవెన్స్) కార్యక్రమాన్ని పురస్కరించుకొని బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కమిషనర్ ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా స్వీకరించిన ఫిర్యాదుల వివరాలు విభాగాల వారిగా టౌన్ ప్లానింగ్33, ఇంజనీరింగ్ 22, రెవెన్యూ 04, హెల్త్, శానిటేషన్ 02, నీటి సరఫరా 04, మొత్తం 65గా ఉ న్నాయి. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, సిఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, డిఎఫ్ఓ శంకర్ లింగం, సిహెచ్ఓ రమేష్, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యుటీ కమిషనర్‌లు ప్రసన్నరాణి, సమ్మయ్య, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంలో గ్రంథాలయాల పాత్ర కీలకం

**ప్రజాపక్షం/ నర్సంపేట :** విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంలో గ్రంథాలయాల పాత్ర కీలకమని ఎంఈవో కొర్రసారయ్య అన్నారు. నర్సంపేట పట్టణంలోని సంజీవని ఆశ్రమంలో లీడ్ లైబ్రరీ నిర్వహణలో మరో గ్రంథాలయ ఉద్యమం పోస్టర్లతో రూపొందించిన జయహో పుస్తకం పరిచయ సభ సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నర్సంపేట ఎంఈఓ కొర్రసారయ్య, ఎన్నారై డాక్టర్ కిషన్ రావు హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా కొర్రసారయ్య మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలనే లక్ష్యంతో ఎంతో ఆకట్టుకునేలా రూపొందించిన ఈ పుస్తకం పాఠకులలో చదువుపై ఆసక్తి పెంపొందించేందుకు ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈకార్యక్రమంలో లీడ్ లైబ్రరీ వ్యవస్థాపకులు కాసుల రవికుమార్, మాతృభూమి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ మోహన్ రావు వినోద్ దంపతులు, మహేష్, జయరాం, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## జిపి భవన పున:నిర్మాణానికి శంకుస్థాపన

**ప్రజాపక్షం/వేలేరు :** వేలేరు మండలంలోని గొల్లకిష్టంపల్లిలోని గ్రామపంచాయితీని 2023 సంవత్సరంలో నాటిఉపముఖ్యమంత్రి డా,రాజయ్య శంఖుస్థాపన చేయగా నాటి కాంట్రాక్టర్ స్లాబ్ వరకు వేసి మధ్యలోనే వదిలివేయగా సోమవారం గ్రామసర్పంచ్ బత్తుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిపి భవన పున:నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు.ఈసంధర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయితీ భవనానికి ఉపాధిహామీ పథకంలో బాగంగా రూ,20 / లక్షల మంజూరు అవ్వగా రూ,6/లక్షల నిధులతో స్లాబువేసి మధ్యంతరంగా ఆపివేయడంతో అసంపూర్తిగా ఉన్న భవననిర్మాణాన్ని మిగతా రూ,14/లక్షలతో పూర్తిచేసి సకాలంలో భవననిర్మాణం పూర్తిచేస్తామని తెలిపారు.కార్యక్రమంలో గ్రామపంచాయితీ కార్యదర్శి ఉమకేశ్వర్ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి క్రీడల్లో రాణించాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** విద్యార్థులు క్రీడల్లో తమ ప్రతిభను చాటు కుని రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆకాంక్షించారు. ఈ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో పాల్గొనుటకు జిల్లా విద్యాశాఖ తరఫున బయలుదేరిన విద్యార్థుల బస్సును సోమవారం ఐడిఓసి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, క్రీడలు శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించడంతో పాటు ఆత్మ విశ్వాసాన్ని పెంచుతాయని తెలిపారు. ప్రభుత్వం సమగ్ర శిక్ష ద్వారా ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తోందన్నారు.రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో పాల్గొనుటకు వివిధ మండలాల నుండి మొత్తం 26 మంది ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు, 7 మంది తల్లిదండ్రులు బయలుదేరారు. జిల్లా తరఫున పాల్గొంటున్న విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచి జిల్లా గౌరవాన్ని నిలబెట్టాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి ముద్దమల్ల రాజేందర్, జిల్లా సమీకృత విద్య కోఆర్డినేటర్, కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ శ్యామల రమేష్, జిల్లా విద్యాశాఖ అధికారులు, సిబ్బంది, ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్లుదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగ, అనాథ విద్యార్థులకు విద్యఫౌండేషన్ ప్రతిభా పురస్కారాలు




**ప్రజాపక్షం/హనుమకొండ :** విద్యఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతియేట దివ్యాంగ మరియు అనాథ విద్యార్థులను ప్రోత్సాహించే కార్యక్రమంలో భాగంగా అమలు చేస్తున్నటువంటి విద్యఫౌండేషన్ ప్రతిభా పురస్కారాలను ఈ యేడు ఏప్రిల్ లో జరగబోయే ఫౌండేషన్ పన్నెండవ వార్షికోత్సవం సందర్భంగా కూడా ఇస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకులు బిల్ల మహేందర్ తెలిపారు. వడ్డేపల్లిలోని సంస్థ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో మహేందర్ మాట్లాడుతూ 2025 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలో పదవ తరగతిలో అత్యధిక ప్రతిభ కనబర్చిన పది మంది దివ్యాంగ, పది మంది అనాథ విద్యార్థులకు విద్యఫౌండేషన్ ప్రతిభా పురస్కారాలు2025 అవార్డ్ తోపాటుగా జ్ఞాపిక, ప్రసంసా పత్రం, ఒక్కొక్కరికి రూ.1016ల నగదు బహుమతిని అందజేస్తామని, పూర్వపు వరంగల్ జిల్లాలోని విద్యార్థులు ఈ అవార్డ్ కు అర్హులని పేర్కొన్నారు. వచ్చే నెల మార్చ్ 15 వ తేదీ వరకు ఫౌండేషన్ కు విద్యార్థులు వారి మెమోలు అందజేయాలని, వివరాలకు 9177604430కు సంప్రదించొచ్చని అన్నారు. సమావేశంలో ఫౌండేషన్ బాద్యులు కలకోట్ల నరేందర్, చింతల కమల, కడుదుల సోమయ్య, ఎన్. ఈషారాణి, ముప్పాళ్ళ కరుణశ్రీ, కూరపాటి శ్రీనివాసు, స్వర్ణలత పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు: కలెక్టర్



**ప్రజాపక్షం/హనుమకొండ :** ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజల నుండి అందిన అర్జీల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు వెంటనే చర్యలు హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని సమావేశపు హాలులో ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ ఎన్. రవి వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజలు 89 అర్జీలను అందజేసినట్లు అధికారులు తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ప్రజావాణి అర్జీలను సంబంధిత శాఖల అధికారులు, తహసిల్దార్లను తక్షణమే పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై వి గణేష్, హనుమకొండ ఆర్డిఓ రాథోడ్ రమేష్, డి ఆర్ డి ఓ మేన శ్రీను, సిపిఓ సత్యనారాయణరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు



**ప్రజాపక్షం/హనుమకొండ :** హనుమకొండ సాయిబాబా మందిరంలో ఆదివారం మహాశివరాత్రి పర్వదినాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తిశ్రద్ధల మధ్య ప్రత్యేక పూజలు, అభిషేకాలు, రుద్రపారాయణాలు నిర్వహించగా, సాయంత్రం హంపి నాట్య కళాక్షేత్రం చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉనికి చర్ల శ్రీనివాస రామానుజన్ స్కూల్ కరస్పాండెంట్ ముచ్చా రాజిరెడ్డి మాట్లాడుతూ చదువుతో పాటు చిన్నారులను వారికి ఆసక్తి ఉన్న కళల పట్ల తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. విద్యతో పాటు సాంస్కృతిక చైతన్యం పెంపొందితేనే పిల్లల్లో సమగ్ర వికాసం సాధ్యమవుతుందని అన్నారు. మహాశివరాత్రి వంటి పవిత్ర పర్వదినాల్లో వేదికలపై ప్రదర్శనలు ఇవ్వడం ద్వారా పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన చిన్నారులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. మందిర చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది మహాశివరాత్రి పర్వదినాన్ని మందిరంలో ఘనంగా నిర్వహిస్తున్నామని, భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. శివరాత్రి రోజున ఉపవాసం, జాగరణ చేయడం ద్వారా మనస్సు పవిత్రమవుతుందని, శివపార్వతుల కలయికను సూచించే ఈ పర్వదినం కుటుంబ ఐక్యతకు, సద్గుణాలకు ప్రతీక అని వివరించారు.ధర్మకర్త మరియు పిఆర్ఓ నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ, కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులందరికీ సాయినాధుని ఆశీస్సులతో పాటు మంచి భవిష్యత్తు కలగాలని ఆకాంక్షించారు. మందిరం తరఫున ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలు, సాంస్కృతిక వేదికలు కూడా నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు. యువత, చిన్నారులలో సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించడమే తమ లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో మందిర సిబ్బంది సాయి కృష్ణ రాజు తదితరులు పాల్గొన్నారు.

## శివకళ్యాణ మహోత్సవానికి హాజరైన కాంగ్రెస్ రాష్ట్ర యువజన నాయకులు

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** మహా శివరాత్రి సందర్భంగా వరంగల్లోని ప్రసిద్ధ శైవ క్షేత్రం శ్రీ రుద్రేశ్వర స్వామి (వేయి స్తంభాల) ఆలయంలో అంగరంగ వైభవంగా నిర్వహించిన శివ పార్వతుల కళ్యాణ మహోత్సవానికి కాంగ్రెస్ రాష్ట్ర యువజన నాయకులు పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అల్లుడు విష్ణు వర్ధన్ రెడ్డి తన సతీమణి డాక్టర్ నాయిని గోదా రెడ్డితో కలిసి హాజరయ్యారు.శివ పార్వతుల కళ్యాణ మహోత్సవాన్ని వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ పవిత్రమైన రోజున శివుడు మనందరినీ రక్షించి, మన జీవితాల్లో శాంతి, సౌభాగ్యం, ఆరోగ్యం కలగజేయాలని అ మహా శివుడిని ప్రార్థించామని తెలిపారు.

## భగవద్గీత సందేశం లోతుగా అర్థం చేసుకోండి

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** భగవద్గీతను లోతుగా చదివి జీవితంలో ఆచరించాలని, చిన్నారులకు ప్రతిరోజూ ఆదిత్య హృదయం పారాయణం చేసే అలవాటు కల్పించాలని ప్రముఖ గీతా ఉపన్యాసకులు రాధా మనోహర్ దాస్ పిలుపునిచ్చారు.హనుమకొండలో నిర్వహించిన ఒక ఆధ్యాత్మిక కార్యక్రమానికి విచ్చేసిన సందర్భంగా సాయి బాబా మందిర ధర్మకర్త నిమ్మల శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా ఆయనను కలిశారు. ఈ సందర్భంగా జరిగిన సౌహార్దపూర్వక సంభాషణలో శ్రీ రాధా మనోహర్ దాస్ మాట్లాడుతూ, భగవద్గీతలోని జీవన సూత్రాలు ప్రతి మనిషికి మార్గదర్శకమని పేర్కొన్నారు. గీతా జ్ఞానం యువతలో ఆత్మవిశ్వాసం, నైతిక విలువలు పెంపొందించడానికి దోహదపడుతుందని అన్నారు. చిన్న వయస్సులోనే పిల్లలకు ఆదిత్య హృదయం వంటి పవిత్ర స్తోత్రాల పారాయణం అలవాటు చేస్తే మనోబలంతో పాటు ధార్మిక చైతన్యం పెరుగుతుందని తెలిపారు.

## సినీ నటుడు మహేష్ బాబు క్యాలెండర్ పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** వరంగల్ నగరంలోని పిన్నవారి స్ట్రీట్ నందు సీనినటుడు సూపర్ స్టార్ కృషి కుమారుడు ఘట్టమనేని మహేష్‌బాబు క్యాలెండర్ పోస్టర్ ఓరుగల్లు ముద్దుబిడ్డ ప్రముఖ పాటల రచయిత, సింగర్ కాసర్ల శ్యామ్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా మహేష్‌బాబు ఫ్యాన్స్ అధ్యక్షుడు గందే నవీన్ పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడుతూ మా చిన్ననాటి మిత్రులు కాసర్ల శ్యామ్ ఇప్పటికి 200 పాటలను రచించి కొన్ని పాటలను పాడి తెలుగు ప్రజల మనసును దోచుకున్న వ్యక్తి కింది స్థాయి నుండి ఉన్నత శిఖరాలను అందుకోవాలని రానున్న సినిమా క్రిష్టా జయ క్రిష్ణా మూవీలో కూడా పాటలు రచించాడని మహేష్ బాబు ధరించిన ప్రత్యేకమైన లాకేట్‌ను మెడలో వేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా మహేష్ బాబు, ప్యాన్స్ జిల్లా అధ్యక్షులు గందే నవీన్, ఉప్పుల అనిల్ కుమార్, వడిచెర్ల ప్రసాద్, చెల్పూర్ రవి కుమార్, పాల్గొన్నారు.

## ఘనంగా సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** బంజారాల ఆరాధ్య దైవంగా కొలిచే సద్గురు సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ గోర్మిటి మలాన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రంగశాయిపేట, నాయుడు పెట్రోల్ పంపు వద్ద గల సేవాలాల్ మందిరంలో సేవాలాల్ జయంతి వేడుకలు నిర్వహించారు. సేవాలాల్ మహారాజ్ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. బంజారాల సాంప్రదయాలతో బంజార నాయకులు మాట్లాడుతూ త్వరలోనే సేవాలాల్ మందిరాన్ని పూర్తి స్థాయిలో నిర్మిస్తామని అందుకు ప్రభుత్వం సహకారం అందిస్తుందని అన్నారు. బంజారాల వేషాధారణలతో చిన్నారులు, మహిళలు చేసిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకుడు పెట్రోల్ పంపు నుండి ఖిలా వరంగల్ పెట్రోల్ పంపు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ వేడుకలలో నిర్వహణ కమిటీ అధ్యక్షులు భూక్య రవీందర్ నాయక్, ఉపాధ్యక్షులు బానోత్ వెంకన్న నాయక్, ప్రధాన కార్యదర్శి తారాచంద్ నాయక్, కోశాధికారి మహేశ్వర్ నాయక్, రాము నాయక్, మల్హార్ నాయక్, సీతారాం నాయక్, బాదావత్ బాలాజీ నాయక్, హరిలాల్ నాయక్, వీరన్న నాయక్, బద్రు నాయక్, ప్రసాద్ నాయక్, హుస్సేన్ నాయక్, 44వ డివిజన్ కార్పొరేటర్ జలగం అనిత రంజిత్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నక్క కొమురెల్లి యాదవ్, 43వ డివిజన్ అధ్యక్షుడు చింతా ప్రకాష్, మాడుగుల రాజ్‌కుమార్, నాయకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## పశుపతినాథ్ దేవస్థానంలో ఘనంగా మహాశివరాత్రి వేడుకలు

**ప్రజాపక్షం/ ఎల్కతుర్తి:** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం వల్లభాపురం గ్రామంలోని శ్రీ పశుపతినాథ్ దేవస్థానం లో ఆదివారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం వేళ ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడింది. శివ నామస్మరణతో మారుమోగిన ఆలయ వాతావరణంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.వేడుకలు ఉదయం అఖండ దీపారాధనతో ప్రారంభమయ్యాయి. అనంతరం గణపతి పూజ నిర్వహించి, మహాన్యాస పూర్వక సామూహిక పంచామృత సహిత రుద్రాభిషేకాలు భక్తుల సమక్షంలో ఘనంగా చేపట్టారు. అర్చన కార్యక్రమాలు, బిల్వార్చన, శివసహస్రనామ పఠనం వంటి విశేష పూజలు భక్తి శ్రద్ధలతో కొనసాగాయి.మహాశివరాత్రి సందర్భంగా జరిగిన ఈ వేడుకలు గ్రామంలో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపాయి.

## శివనామస్మరణతో మార్మోగిన శివాలయాలు

**ప్రజాపక్షం/భీమదేవరపల్లి :** భీమదేవరపల్లి మండలంలోని శివాలయాలు శివనామస్మరణతో భక్తుల భజనలతో కిటకిటలాడాయి ముల్కనూర్ లోని సాంబశివ ఆలయం, ముత్తారంలోని త్రికోటేశ్వరాలయం వంగర గ్రామంలోని కైలాసనాథ క్షేత్రం కొత్తపల్లి నందు సాయిబాబా ఆలయం నందు కొత్తకొండలోని వీరభద్ర స్వామి దేవస్థానం నందు శివరాత్రి సందర్భంగా ఉదయం ఐదు గంటల నుండి భక్తుల తాకిడితో రద్దీగా మారింది. శ్రీ సాంబమూర్తి దేవాలయం ముల్కనూర్ నందు సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి ఉపసర్పంచ్ కాసగోని మమతా బాలకృష్ణ శివుడికి పట్టు వస్త్రాలు గ్రామంలోని వీధుల గుండా డప్పు చప్పులతో సమర్పించడం జరిగింది.అలాగే మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## నిరుపేదలకు ఆదుకోడమే జికె ఫౌండేషన్ లక్ష్యం

**ప్రజాపక్షం/రాయపర్తి:** నిరుపేదలను ఆదుకోవడమే జికె ఫౌండేషన్ లక్ష్యమని ఫౌండేషన్ చైర్మన్, తెలంగాణ మాదిగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు గారే వెంకటేష్ మాదిగ అన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన ఐత కుమార్ తల్లి లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మరణించగా సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి జికె ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జికె ఫౌండేషన్ డైరెక్టర్ గారే సందీప్, వార్డు మెంబర్ గారే యాకూబ్, గారే శ్రీనివాస్, ఐత సంపత్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సంత్ సేవాలాల్ జయంతీ వేడుకలు

**ప్రజాపక్షం/వేలేరు :** బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ 287 వజయంతీ వేడులను సేవాలాల్ సేనా మండల వ్యవస్థాపకుడు ఆంగోతు సాంబయ్య ఆద్వర్యంలో ఆదివారం వేలేరు మండలఅధ్యక్షుడు మురావత్ రాజు ఘనంగా నిర్వహించారు. అనంతరం మండలంలోని చింతలతండ, కమ్మరిపేటతండాలలో భోగ్ బండార్ చేశారు. ఆయాగ్రామాల సర్పంచ్‌లు రాజు, సాంబయ్య, కిరణ్‌లతోపాటు వేలేరు గ్రామసర్పంచ్ బిల్ల యాదగిరి, హాజరై సేవాలాల్ చిత్రపటానిక పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీవైస్ ఎంపిపి సంపత్, మాజీ ఎంపిటిసి సాంబరాజు, మాజీసర్పంచ్ అమర్‌సింగ్, శ్రీకాంత్, భాస్కర్, అంజీ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయం



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ విజయం ప్రజల విజయమని, ఈ గెలుపుతో మాపై ఇంకా బాధ్యత ను పెంచిందని, ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా భూపాలపల్లి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. సోమవారం భూపాలపల్లి మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు నిర్వహించగా చైర్మన్ వైస్ చైర్మన్ ప్రమాణ స్వీకారం అనంతరం మీడియాతో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజల ఆకాంక్ష మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో భూపాలపల్లి మున్సిపాలిటీ ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని అన్నారు. ఎలాంటి అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా పట్టణాన్ని అభివృద్ధి దిశగా వెళ్తున్న సందర్భంలో నూతనంగా ఎన్నికైన చైర్మన్ వైస్ చైర్మన్ తో పాటు గౌరవ కౌన్సిలర్ సభ్యులందరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. భూపాలపల్లి మున్సిపాలిటీలో ఉన్న అనేక సమస్యలను పరిష్కరిస్తామని మౌలిక వసతుల కల్పన,పట్టణంలో ఉన్న కోతులు, కుక్కల బెడదను నివారించే విధంగా కౌన్సిలర్లు ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్లాలని సూచించారు. ఈ ఎన్నికకు సహకరించిన అధికారులు, మీడియా మిత్రులు పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, డిసిసి అధ్యక్షులు బట్టు కరుణాకర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్, స్థానిక అధికారులు నాయకులు పాల్గొన్నారు.

## తాగు నీటిపై సర్పంచులు ప్రత్యేక దృష్టి పెట్టాలి



**ప్రజాపక్షం/కమలాపూర్:** రానున్న వేసవి కాలం దృష్ట్యా అన్ని గ్రామాల సర్పంచ్, అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని మండల అభివృద్ధి అధికారి గుండె బాబు అన్నారు. కమలాపూర్ మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో గ్రామ పంచాయతీలలో నూతనంగా ప్రజలచే ఎన్నికైన సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులతో మంచినీటి ఎద్దడికి సంబంధించి సమీక్షా, సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిడివో గుండె బాబు మాట్లాడుతూ.... రానున్న వేసవి కాలం దృష్ట్యా మండలంలోని అన్ని గ్రామపంచాయతీల పరిధిలో మంచి నీటి ఎద్దడి రాకుండా ముందస్తుగా నివారణ చర్యలు చేపట్టాలని, మిషన్ భగీరథ సంబంధించిన ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ గ్రామాలలోని పైప్‌లైన్ లో లీకేజీలు వెంటనే మరమ్మత్తు చేయిస్తూ ప్రతి కుటుంబానికి మంచినీటి సరఫరా అందే విధంగా చూడాలని అన్నారు. మిషన్ భగీరథ కు సంబంధించిన డిప్యూటి ఇంజనీర్లు బాలరాజు, అనిల్ మాట్లాడుతూ... గ్రామంలో మంచినీటి సరఫరాలో ఏమైనా ఇబ్బందులు ఏర్పడినచో వెంటనే మిషన్ భగీరథ కు సంబంధించిన ఏఈలకు సమాచారం ఇచ్చి సత్వరమే అట్టి సమస్యను పరిష్కరించుకోవాలని సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, త హశీల్దార్ సురేష్, మండల పంచాయతీ అధికారితో పా టు అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, పం చాయతీ కార్యదర్శులు, మిషన్ భగీరథ అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడల్లో సత్తా చూపాలి




**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** నాల్గవ తెలంగాణ రాష్ట్ర పోలీస్ డ్యూటీ మీట్ క్రీడల్లో వరంగల్ కమిషనరేట్ పోలీసులు సత్తా చాటాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సూచించారు.రేపటి నుండి సైబరాబాద్ కమిషనరేట్ లో ప్రారంభమయ్యే తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ మీట్ పోటీల్లో, క్రీడా గ్రామంలో ఎగురవేసే వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రీడా పతకాన్ని పోలీస్ కమిషనర్ పోలీస్ అధికారులు, క్రీడాకారులతో కలసి ఆవిష్కరించారు. అనంతరం ఈ పోటీల్లో పాల్గొనే పోలీస్ క్రీడాకారులకు క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ చేతుల మీదుగా ట్రాక్ సూట్ తో పాటు స్పోర్ట్స్ షూ, టీ షర్ట్ అందజేశారు.క్రీడాకారులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రాష్ట్ర పోలీస్ క్రీడల్లో వరంగల్ పోలీస్ క్రీడాకారులు తమ సత్తా చూపాలని, పోలీసులు శాంతి భద్రతల్లోనే కాదు క్రీడల్లో కూడా రాణించగలరని, క్రీడల్లో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి శాఖపరమైన గుర్తింపు వుంటుందని సీపీ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏసీపి నాగయ్య, ఆర్.ఐ సతీష్, ఆర్. ఎస్.ఐ శ్రవణ్ కుమార్, క్యాంపు క్లర్క్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

## అంబేద్కర్ కూడలి వద్ద స్కూల్ బస్సు-లారీ ఢీ

### చిన్నపిల్లలకు తప్పిన ప్రమాదం

**ప్రజాపక్షం/భీమదేవరపల్లి:** భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ అంబేద్కర్ కూడలి వద్ద సోమవారం ఉదయం శ్రీ చైతన్య స్కూల్ బస్సు పిల్లల్ని తీసుకొని స్కూలుకు వెళుతున్న సమయంలో అంబేద్కర్ కూడలి వద్ద ఎదురుగా వస్తున్న లారీకి ఢీ కొట్టి బస్సు డ్యామేజ్ కావడం జరిగింది. అందులో ఇద్దరు పిల్లలకి చిన్న గాయాల తో అదృష్టవశాత్తు బయటపడ్డారు. 50 మంది పిల్లలతో వెళ్తున్న స్కూలు బస్ కు పెద్ద డ్యామేజ్ జరిగి ఉంటే ఆ పిల్లల తల్లిదండ్రులు పరిస్థితి ఎంత దారుణంగా ఉండేదో ఊహించుకోవచ్చు. చాలా రోజులుగా రోడ్డు వర్క్ జరుగుతూ అంబేద్కర్ కూడలి వద్ద ఆగిపోవడం జరిగింది హనుమకొండ నుండి హుస్నాబాద్, హుస్నాబాద్ నుండి హనుమకొండ కు వెళ్లే వాహనాలకు ముల్కనూర్ నుండి అంబేద్కర్ కూడలికి వచ్చే లోకల్ వాహనాలు మెయిన్ రోడ్డుపై వెళ్లే వాహనాలకు అంబేద్కర్ విగ్రహం వాహనాలకు అడ్డుగా ఉండడంతో చాలా ప్రమాదాలు జరుగుతున్నాయి. గత కలెక్టర్ అంబేద్కర్ విగ్రహాన్ని తీసి వేరే చోటికి మార్చాలని తెలిపినప్పటికీ కొన్ని ప్రజాసంఘాలు అక్కడి నుండి విగ్రహాన్ని తరలించకూడదని పట్టు పట్టడంతో ఆ సమస్య జటిలంగా మారి ప్రజలకు వాహనదారులకు ఇబ్బందులుగా తయారైంది. కలెక్టర్ గాని రాజకీయ నాయకులు గానీ దీనిపై త్వరగా నిర్ణయం తీసుకొని విగ్రహాన్ని తరలించడం లేదా సెంటర్ లో ఏర్పాటు చేసి చుట్టూ ఫెన్సింగ్ చేయడము జరగాలి లేదంటే చాలామంది వాహనదారులు ఇబ్బందులు పడవలసి వస్తుంది. గ్రామానికి చెందిన వారు ఎవరు కూడా అంబేద్కర్ విగ్రహం అక్కడే ఉంచాలని కోరుకోకపోవడం చుట్టూ ఉన్నటువంటి గ్రామాలకు సంబంధించిన వారు మాత్రమే అక్కడే ఉండాలని పట్టు పట్టడం కోస మెరుపు వెంటనే అధికారులు చర్యలు తీసుకొని ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరుకుంటున్నారు.

## వాయిదా పడిన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** జనగామ మున్సిపాలిటీకి సంబంధించి చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక మంగళవారానికి (నేటికి) వాయిదా పడిందని ప్రిసైడింగ్ అధికారి, ఆర్డీవో గోపిరామ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాయిదా పడిన చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికను మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మధ్యాహ్నం నిర్వహించడం జరుగుతందన్నారు. కావున ఈ కార్యక్రమానికి వార్డు సభ్యులందరితో పాటు, ఎక్స్ అఫీషియో సభ్యులు కూడా తప్పకుండా హాజరుకావాలని తెలిపారు.

## సర్పంచ్‌లను సన్మానించిన అధి-కారులు

**ప్రజాపక్షం/కమలాపూర్:** ఇటీవల జరిగిన ఎన్నికలలో సర్పంచ్ గా ప్రజలచే ఎన్నికైన అన్ని గ్రామాల సర్పంచులను కమలాపూర్ మండల అభివృద్ధి కార్యాలయంలో తహశీల్దార్ సురేష్, ఎంపిడివో గుండె బాబు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శుల సమక్షంలో శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని సర్పంచులను కోరారు. సర్పంచులు తమ కాలపరిమితిలో చేసినటువంటి అభివృద్ధి ప్రజలకు చిరస్మరణీయంగా ఉండేలా కృషి చేయాలని అన్నారు.

## రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న కుడా చైర్మన్

**ప్రజాపక్షం/ఆత్మకూరు :** ఆత్మకూరు మండలం కటాక్షపూర్‌లోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి మహోత్సవం అంగరంగ వైభవంగా కన్నుల పండుగగా జరిగింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు ఉపవాసాలు పాటించి, భక్తి భావంతో ఉదయం నుంచే దర్శనం కోసం ఆకర్షితులయ్యారు.ఆదివారం హనుమకొండ డీసీసీ అధ్యక్షులు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. పూజారి సంపత్ ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ షబాన గఫూర్ శివాలయం అభివృద్ధికి సహకరించాలని ఇగాలను కోరగా, స్పందించిన ఆయన ఎండోమెంట్ అధికారికి ఫోన్లో మాట్లాడారు , శివాలయ అభివృద్ధికి ప్రభుత్వపరంగా అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గం, దేవాలయ కమిటీ చైర్మన్, ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. రాత్రి జాగారంలో సంస్కృత కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

## కిలో వెండి నాగ పడగ సమర్పించి మొక్కులు చెల్లించుకున్న కుటుంబ సభ్యులు

**ప్రజాపక్షం/ఎల్కతుర్తి :** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామెర గ్రామంలోని శివరాత్రి పర్వదినాన శ్రీ రాజరాజేశ్వర ఆలయ శివ లింగానికి మూడు లక్షల విలువ చేసే కిలో వెండి తో నాగ పడగ చేయించి బరీదుల రవీందర్ రెడ్డి సునీత దంపతులు మొక్కులు చెల్లిన్చుకున్నారు.ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ తాము శివ భక్తులు అని కోరిన కోర్కెలు తిరుతే వెండి సమర్పిస్తామని మొక్కుకున్నట్లు తెలిపారు,సజీవ లింగానికి వెండి తో నాగ పడగా చేయించి ఆలయ అర్చకులు శ్రీనివాస్ మరియు కమిటీ సభ్యుల సమక్షం లో అందజేశారు.అనంతరం ఘనంగా శివ పర్వతుల కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో అధ్యక్షులు కొమ్మిడి లిచ్చిరెడ్డి,చల్ల నరేందర్ రెడ్డి, మద్దె రాములు,కొమ్మిడి వెంకట్ రెడ్డి,చల్ల ప్రతాప్ రెడ్డి,భగవాన్ గౌడ్, కొప్పెర కుమార్ స్వామి,సురేందర్ రావు,అల్లెపు రాజు,రావుల విజెయ్,బేతి కేశవులు పాల్గొన్నారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

**ప్రజాపక్షం/నెక్కొండ:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని విద్యోదయలో స్వయం పరిపాలన దినోత్సవం సోమవారం విద్యోదయ హైస్కూల్‌లో స్వయం పరిపాలన దినోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయుల పాత్రలు పోషిస్తూ తరగతులను బోధించారు. ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులు తమ అనుభవాలను పంచుకుంటు, గురువుల వృత్తి ఎంత బాధ్యతతో కూడుకున్నదో తమకు స్పష్టం తెలిసి వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్‌మాస్టర్ చల్లా నాగార్జున రెడ్డి, డైరెక్టర్ చల్లా పారిజాతం, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎండి షరీఫ్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

## ప్రమాణ స్వీకారం చేసిన బిఆర్ఎస్ కౌన్సిలర్లు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి మున్సిపాలిటీలో జరిగిన ఎన్నికల్లో గెలిచిన భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) కౌన్సిలర్ అభ్యర్థులను భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి ఘనంగా సన్మానించారు. బి ఆర్ ఎస్ తరఫున గెలిచిన పదిమంది కౌన్సిలర్లు సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ, ప్రజాసేవ పట్ల నిబద్ధతతో పనిచేసి భూపాలపల్లి మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగస్వాములవుతూ, పార్టీ గౌరవాన్ని మరింత పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో29 వ వార్డు కౌన్సిలర్ గండ్ర హరీష్ రెడ్డి, నూతన కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## పోచన్నపేటలో పర్యటించిన సర్పంచ్

**ప్రజాపక్షం/బచ్చన్నపేట :** గ్రామాలలోని సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని వాటిని పరిష్కరించడమే లక్ష్యంగా సోమవారం పోచన్నపేట గ్రామంలో గుడ్ మార్నింగ్ సోమవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఎండీ ఫిరోజ్ మొదటి వార్డులో పర్యటించి స్థానిక ప్రజలతో ముఖాముఖిగా మాట్లాడారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పంచాయితి సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ




**ప్రజాపక్షం/జఫర్‌గడ్ :** జఫర్‌గడ్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని తిమ్మంపేట గ్రామంలోని మల్లిఖార్జున స్వామి దేవస్థానంలో ఉపవాస భక్తులకు ఉప సర్పంచ్ రాకేష్ సహాయంతో పండ్లు పంపిణి చేయడం జరిగింది. అదేవిధంగా తిమ్మంపేట గ్రామంలోని వీరాంజనేయస్వామి భక్తులకు, జఫర్‌గడ్ నీలకంఠ పరమేశ్వర దేవస్థానంలోని భక్తులకు కూడా పండ్లను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ పూర్ణచందర్, ట్రెజరర్ బాలరాజు, స్టేషన్‌ఘనపూర్ ట్రెజరర్ అశోక్, రమేష్, సోమేశ్వర్, శ్రీధర్, సంతోష్, రాజు, బోనగిరి శ్రవణ్‌కుమార్, శివప్రసాద్, గ్రామ గుడి పూజారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సిఎం కప్ క్రీడలకు విద్యార్థుల ఎంపిక

**ప్రజాపక్షం/పాలకుర్తి :** ఇటీవల జనగామలో నిర్వహించినటువంటి జిల్లా స్థాయి సిఎం కప్ క్రీడలలో పాలకుర్తి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. ఎంఇఒ పోతుగంటి నర్సయ్య, హెచ్ఎం శోభారాణి, పిడి మామిండ్ల సోంమల్లు, ఉపాధ్యాయులు రమేష్, బలరాం, రవి, వెంకన్న, తల్లిదండ్రులు అభినందించారు.

# కోటగుళ్ల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం

ఇప్పటికే ప్రతిపాదనలు పంపించాం
రామప్ప సరసన కోటగుళ్లకు స్థానం
ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/గణపురం :** గణపురం మండల కేంద్రంలోని కోటగుళ్ల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశామని ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు పంపించామని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా ఆదివారం రాత్రి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కోటగుళ్లను సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆయనను సాదరంగా ఆహ్వానించారు. స్వామివారికి పూజలు నిర్వహించిన అనంతరం శివపార్వతుల కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు గంగాధర్ నాగరాజులు ఆయనకు ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ ప్రాంగణంలో జాగరణ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని కోటగుళ్ల 20 ఏళ్ల ప్రస్థానంపై ఆలయ ధర్మకర్త అట్లూరి వెంకటలక్ష్మి నరసింహారావు పావన రాజ్యలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో తాళ్లపల్లి యాదగిరి గౌడ్ రచించిన పుస్తకాన్ని వేదికపై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే కోటగుళ్ల అభివృద్ధికి రెండు కోట్లు కేటాయించామని రాబోయే రోజుల్లో ఆలయ అభివృద్ధికి మరో 50 కోట్లు మంజూరు చేసేలా ప్రతిపాదనలు పంపించామని అన్నారు. ఆలయ విశిష్టత నిర్వహణపై పుస్తకాన్ని ప్రచురించిన ఏవి ఎల్ ఎన్ రావు దంపతులను రచించిన సీనియర్ జర్నలిస్ట్ తాళ్లపల్లి యాదగిరి గౌడ్ లను ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పోషకులు నిర్వాహకులు, డాక్టర్ కోడూరు నవీన్ కుమార్, గణపురం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రేపాక రాజేందర్, కోటగుళ్లు పరిరక్షణ కమిటీ గౌరవ అధ్యక్షులు మామిండ్ల మల్లికార్జున్ గౌడ్, మాజీ ఎంపీపీ వడ్లకొండ నారాయణ గౌడ్, మాజీ కోఆప్షన్ సభ్యులు ఎండి చోటెమియా, మాజీ సర్పంచ్ దూడపాక శంకర్, బోనాల రాజమౌళి,ఉపసర్పంచ్ ఓరుగంటి కృష్ణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మల్లన్న గుట్ట జాతర



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం నాచారం గ్రామం మల్లన్నగుట్ట శ్రీ మల్లికార్జున స్వామి ని దర్శించుకున్న గొర్లవీడు గ్రామ సర్పంచ్ మందల లావణ్య విద్యా సాగర్ రెడ్డి,తండా సర్పంచ్ రాజకుమార్ నాయక్ దంపతులు మల్లన్నగుట్ట శ్రీ మల్లికార్జున స్వామి వారికి పట్నాలు వేసి స్వామి వారి ఆశీస్సులు పొందారు.అనంతరం ఇరువురి సర్పంచ్ లను ఆలయకమిటీ వారు ఘనంగా సన్మానించారు. వారివెంట గొర్లవీడు బిఆర్ఎస్ పార్టీ నాయకులు బోనగాని రమేష్, రమణచారి, తంగళ్లపల్లి సుధాకర్, ముజ్జహిద్ నరేష్, తదితరులు ఉన్నారు. శివరాత్రి సందర్భంగా నాచారం గ్రామంలోని (మల్లన్న గుట్ట) మల్లికార్జునస్వామికి మొక్కులు చెల్లిచుకోవడానికి గొర్లవీడు గ్రామ ప్రజలు, యాదవ సోదరులు డప్పు వాద్యాలతో, బోనాలతో భారీ ఎత్తున చేరుకొని మల్లికార్జున స్వామికి పసుపు బండారితో పట్నాలు, మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో గొర్లవీడు యాదవ సంఘం అధ్యక్షులు దోమల సదయ్య,ఉప అధ్యక్షులు మేకల కుమార్,కార్యదర్శి బండారి సంపత్,కొనుపుల సదయ్య, మామిడి రాజాకోమురు,మూడెత్తుల రాజయ్య, బంగారి పెద్ద శంకర్, గొడుగు ఐలయ్య, బుర్గుల రామస్వామి, బుర్గుల దేవేందర్, కొనుపుల ఎల్లయ్య, శంకర్, రాజపాల్, రాజయ్య, కందునూరి రాజయ్య, రాపాక ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# కమనీయం శివపార్వతుల కల్యాణం

**ప్రజాపక్షం/పాలకుర్తి :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ సోమేశ్వర లక్ష్మి నరసింహస్వామి దేవాలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివపార్వతుల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కల్యాణ మహోత్సవానికి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి స్వామి వారికి పట్టు వస్త్రాలు తలంబ్రాలు, మేళతాళాలతో సమర్పించారు. వేద మంత్రాల నడుమ స్వామి వారి కల్యాణం కనుల పండుగగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాలకుర్తి మార్కెట్ కమిటి చైర్‌పర్సన్ మంజుల భాస్కర్, ఎసిపి నర్సయ్య, తహసీల్దార్ సరస్వతి, ఎంపిడిఒ వేదవతి, సిఐ జానకీరామ్ రెడ్డి, ఎస్ఐ



పవన్‌కుమార్, ఆలయ ఇఒ లక్ష్మి ప్రసన్న, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, సర్పంచ్‌లు, భక్తులు పాల్గొన్నారు.

# పసిడి కాంతులతో పంగిడి మల్లన్న పెద్దపట్నం

**ప్రజాపక్షం/తరిగొప్పుల :** పంగిడి మల్లన్న పెద్ద పట్నం కార్యక్రమం భక్తుల కోలాహలం మధ్య అత్యంత వైభవంగా జరిగింది. తరిగొప్పుల మండలంలోని అబ్దుల్ నాగారం గ్రామ శివారులో గల పంగిడి మల్లన్న పెద్ద పట్నంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా మహాశివరాత్రిని పురస్కరించుకుని తెల్లవారు జామున స్వామివారి పెద్ద పట్నం కార్యక్రమాన్ని బెల్లం పరమేశ్వర్, నరసయ్య కళాబృందం పంచవర్ణాలతో పెద్ద పట్నాన్ని వేశారు. రాత్రంతా శివనామస్మరణలతో జాగారం చేసిన భక్తులు పెద్దపట్నాన్ని తొక్కేందుకు ఉత్సాహం కనబరిచారు. ముందుగా ఆలయ పూజారులు, యాదవ సంఘం సభ్యులు ఉత్సవ విగ్రహాలను తీసుకుని పట్నం దాటారు. అనంతరం భక్తులను అనుమతించడంతో శివసత్తులు కేకలతో పట్నంపైకి ఒక్కసారిగా దూసుకెళ్లి ఆటపాటలతో ఆనందం పొందారు. అధిక సంఖ్యలో భక్తులు రావడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా యాదవ సంఘం అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మామిడాల మల్లేష్ మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మేకల రాజు, గాలయ్య, శ్రీశైలం, గట్టయ్య, రమేష్, సంపత్, నరేష్, అపరాప రమేష్, బిక్షపతి, కుమార్, పోశయ్య, కనకయ్య, రాజు, కనకరాజు, చంద్రం, మల్లేష్, సారయ్య, గట్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న మాజీ స్పీకర్



**ప్రజాపక్షం/గణపురం :** గణపురం మండలంలోని లక్ష్మారెడ్డిపల్లిలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీరామలింగేశ్వర అభయాంజనేయ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు మాజీ స్పీకర్, శాసనసభ పక్షనేత ప్రస్తుత ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనా చారి, శివరాత్రి జాగరణలో భాగంగా ఆయన అర్ధరాత్రి లింగోద్భవ కాలంలో ఆలయంలో పూజలు జరిపారు. అనంతరం ఆయన గ్రామస్తులను ఆప్యాయంగా పలకరిస్తూ సంభాషించారు. పలువురు గ్రామస్తులు గ్రామంలోని వల సమస్యలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాను అధికారంలో ఉన్నప్పుడు ఈ చిన్న గ్రామాన్ని గ్రామపంచాయతీగా ఏర్పాటు చేశానని,గ్రామ అభివృద్ధికి నిధులు కేటాయించి అభివృద్ధి చేశానని అన్నారు.ఇకపై కూడా ప్రజల సుఖ సంతోషాలు అభివృద్ధి కోసమే తన కృషి ఉంటుందని తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరికలు

**ప్రజాపక్షం/కన్నాయిగూడెం :** ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం ముప్పనపల్లి గ్రామపంచాయతీలో టిఆర్ఎస్ పార్టీ నుండి ఏకగ్రీవంగ ఎన్నికైన నూతన సర్పంచ్ తిప్పనపల్లి లక్ష్మయ్య, లక్ష్మీపురం గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ కొట్టే ఉమామహేశ్వరి, మరికొందరు టిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కన్నాయిగూడెం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అప్సర్ పాషా, మండల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి సర్పంచ్ జాడి రాంబాబు, ఆధ్వర్యంలో సోమవారం ములుగు డిఎల్ఆర్ ఫంక్షన్ హాల్ లో మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి మంత్రి సీతక్క కాంగ్రెస్ పార్టీ కండువకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కన్నాయిగూడెం మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వివిధ గ్రామాల సర్పంచులు, మహిళలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పచ్చదనాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత

**ప్రజాపక్షం/మహాదేవపూర్ :** పచ్చదనాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కుదురుపల్లి సర్పంచ్ చల్ల సమ్మి రెడ్డి అన్నారు. సోమవారం 2026–27వ సంవత్సరానికి వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కుదురుపల్లి గ్రామంలోని నర్సరీలో మొక్కల పెంపకానికి కావల్సిన ఎరువులు,మట్టిని కవర్లలో నింపే కార్యక్రమాన్ని ప్రాంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో పచ్చదనాన్ని కాపాడడానికి మొక్కల పెంపకంపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని అన్నారు.చెట్లతో మానవ మనుగడ సాధ్యమని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అమురాజి యశోద రవి,కార్యకర్తలు నీర్ల జీవన్,గోమాస కుమార్, కూలీలు పాల్గొన్నారు.

## చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

**ప్రజాపక్షం/మహాదేవపూర్ :** చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ప్రతి ఒక్రు కృషి చేయాలని రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు.ఆదివారం మండలకేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఆటో లడ్డు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీపాద స్మారక చలివేంద్రాన్ని ఆయన ప్రాంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడల తీవ్రత రోజురోజుకు పెరుగుతుందని,నిత్యం మండల ప్రజలు ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటాని వారి దాహార్తిని తీర్చడానికి ఇలాంటి చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రందాలయ చైర్మెన్ రాజబాబు, సర్పంచ్ హసీనా బానో ,మాజీ జడ్పిటీసి చల్ల తిరుపతి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అశోక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దేశంలో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనే ముఖ్యం

**ప్రజాపక్షం/కేయూ క్యాంపస్ :** “భారతదేశానికి తగిన ప్రాథమిక మౌలిక సదుపాయాలు, ఆహారం, నివాసం, విద్య, ఆరోగ్యం వంటి అవసరాలు ఇప్పటికీ అత్యంత ప్రాముఖ్యమైనవే” అని కేయూ వైస్‌చాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ సెనెట్ హాల్‌లో రాజకీయ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం అధ్యక్షతన నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సు “పాపులిస్ట్ పాలసీస్ ఇన్ పోస్ట్ లిబరలైజేషన్” ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం అవసరమే అయినప్పటికీ దీర్ఘకాలిక అభివృద్ధి కూడా సమానంగా ముఖ్యమని పేర్కొన్నారు. దేశంలో ధనిక–పేదల మధ్య అంతరం పెరుగుతున్నదని వివిధ నివేదికలు సూచిస్తున్నాయని తెలిపారు. “సహానుభూతితోనే సంక్షేమం ప్రారంభమవుతుందని, అయితే, దానికి బలమైన ఆధారాలు, సమగ్ర ప్రణాళిక, సమర్థవంతమైన అమలు అవసరం” అని ఆయన అన్నారు. బలహీన వర్గాల అవసరాలను తీర్చేందుకు సంక్షేమ పథకాలు కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని, అయితే కొన్ని సందర్భాల్లో అవి ఓటర్లను ఆకర్షించే రాజకీయ ఆయుధాలుగా మారుతున్నాయనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. భారతదేశంలో ప్రజాహితవాదం (పాపులిజం),ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థ మధ్య సమతుల్యం అవసరమని ఆయన సూచించారు. ఆర్థిక సరళీకరణ విధానాల అమలుతో సంక్షేమం విస్మరించబడిందనే అభిప్రాయం ఉన్నప్పటికీ, ప్రభుత్వాలు వివిధ పేర్లతో సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే ఉన్నాయని తెలిపారు. అయితే, వాటిలో కొన్ని జనాకర్షక పథకాలుగా మారుతున్నాయని వ్యాఖ్యానించారు. ఆర్థిక సరళీకరణ నేపథ్యంలో మార్కెట్ వ్యవస్థలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయని, కొందరు మరింత సంపన్నులవుతుండగా, పేదలు మరింత వెనుకబడుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయని నివేదికలు సూచిస్తున్నాయని చెప్పారు. సంక్షేమ పథకాల ప్రధాన లక్ష్యం దారిద్ర్య రేఖ దిగువన ఉన్న ప్రజలను ఆర్థికంగా, సామాజికంగా పైకి తీసుకురావడమే కావాలని వైస్‌చాన్సలర్ స్పష్టం చేశారు. హైదరాబాద్, ఉస్మానియా యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ విభాగం విశ్రాంత ఆచార్యులు ఆచార్య కంచె అయిలయ్య తన కీలక ఉపన్యాసంలో విద్యార్థులు పుస్తక ప్రియులుగా మారాలని, సమాజిక అంశాలపై లోతైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సంక్షేమాన్ని రాజకీయ అస్త్రంగా ఉపయోగించే ధోరణి పెరుగుతోందని విమర్శించారు. సం క్షేమ వ్యవస్థ బలహీనపడితే కార్పొరేట్ రంగం బలపడే అవకాశముందని హెచ్చరించారు. జాతీయ స్థాయి నిర్ణయాధికారం అధికంగా కేంద్రం చేతుల్లో కేంద్రీకృతమవుతోందని తెలిపారు. ఈ కార్యక్రమం లో సెమినార్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సంకినేని వెంకట్, పార్థ్య ప్రణాళిక అధ్యక్షులు డాక్టర్ గడ్డం కృష్ణయ్య, డాక్టర్ వి. సత్యనారాయణ, డాక్టర్ వి.నాగరాజు, విశ్రాంత ఆచార్యులు ఆచార్య రఘురాం రెడ్డి, ఆచార్య వీరన్న, ఆచార్య దినేష్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసారు.




# విద్యార్థి వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి




**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** కేంద్ర ప్రభుత్వ విద్యార్థి వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాషబోయిన సంతోష్ అన్నారు. స్థానిక బాలసముద్రం ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో కాజీపేట మండల 11వ మహాసభ జిల్లా ఉపాధ్యక్షులు వేల్పుల చరణ్ అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా జిల్లా కార్యదర్శి భాషబోయిన సంతోష్ హాజరై మాట్లాడుతూ పాలకులు అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలు ఎప్పటికప్పుడు ఎండ గడుతూ విద్యార్థుల హక్కుల కోసం నిర్విరామంగా పోరాడుతున్నదన్నారు. ఎఐఎస్ఎఫ్ ఈ తరుణంలో విద్యారంగంలో వస్తున్న మార్పులను విద్యార్థులకు తెలియపరుస్తూ, విద్యార్థి లోకాన్ని చైతన్య పర్చడం కోసం, విద్యారంగ సమస్యలపై చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందించడానికి ఈ మండల మహాసభ ఉపయోగపడిందని దీంట్లో తీసుకున్న నిర్ణయాల కనుగుణంగా ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణ కోసం, పెండింగ్ లో ఉన్న ఫీజు బకాయిల కోసం , ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల నియంత్రణ కోసం పోరాటాలు నిర్వహించడం కోసం ఈ మహాసభ లో ప్రవేశపెట్టిన తీర్మానాలకు అనుగుణంగా ఎన్నికైన నాయకులు కృషి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష కార్యదర్శులు వి రాజు, ఎం అనిల్, మండల ఉపాధ్యక్షులు ఎన్ సాయిరాం, రితీష్, సుమంత్ మండల సహాయ కార్యదర్శి నిహాల్, అవినాష్, సునిషిత్ లతోపాటు కమిటీ మెంబర్స్ క్రిశాంక్, రేవంత్ కిరణ్, సృజన్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

# శివపార్వతుల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/వెంకటాపూర్ :** ఆదివారం వెంకటాపూర్ మండలం పాలంపేట ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన కాకతీయుల అద్భుత శిల్ప సౌందర్యం కలిగిన రామప్ప శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం లో శివపార్వతుల కళ్యాణం కన్నుల పండుగ అంగరంగ వైభవంగా జరిగింది.మహా శివరాత్రి పర్వ దినం సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క రామప్ప దేవాలయం శ్రీ రామలింగేశ్వర స్వామివారిని దర్శించుకుని పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు మంత్రి అనసూయ సీతక్కకు తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం మంత్రి శివపార్వతుల కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు.రామప్ప ఆలయ ప్రాంగణంలో జాగరణ భక్తుల కోసం ఏర్పాటుచేసిన శాతరాజు నవ్యజా పేరిణి బృందం విద్యారణ్య ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల 12 మంది విద్యార్థుల నృత్య కలప్రదర్శన , ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఆలయ ఈవో, రామప్ప ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ కాంగ్రెస్ కైవసం



**ప్రజాపక్షం/స్టేషన్ ఘన్ పూర్ :** నూతనంగా ఏర్పడిన స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ మొట్ట మొదటి చైర్మన్, వైస్ చైర్మన్ పదవులతో పాటు మున్సిపాలిటీని అభివృద్ధి చేసే బాధ్యత కూడా పెరిగిందని మాజీ ఉప ముఖ్య మంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు.స్టేషన్ ఘన్ పూర్ మున్సిపాలిటీకి మొదటిసారిగా జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకొని చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను దక్కించుకోవడంతో ఘనపూర్ పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సంబరాలు అంబరాన్ని అంటాయి. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక అనంతరం మున్సిపల్ కార్యాలయం నుండి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో డప్పు చప్పుల్లు, డిజే పాటలు, బాణాసంచా పేలుళ్ళ మధ్య జై కాంగ్రెస్ నినాదాలతో ఘనపూర్ పట్టణ కేంద్రం మారుమోగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు, కార్యకర్తలు డ్యాన్స్ చేస్తుండగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి వారిని ఉత్సాహ పరిచారు. చైర్మన్ గా ఎన్నికన 13వార్డు అభ్యర్థి తాటికొండ వినయ్ కుమార్, వైస్ చైర్మన్ గా ఎన్నికైన నీల రాజమ్మ, కౌన్సిలర్లను భారీ గజ మాలతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే మాట్లాడుతూ.... కాంగ్రెస్ ప్రభుత్వంతో ఎమ్మెల్యే కడియం శ్రీహరితోనే అభివృద్ధి సాధ్యం అని నమ్మి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించిన స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ ప్రజలకు చేతులెత్తి నమస్కరిస్తున్నట్లు తెలిపారు. నూతనంగా ఏర్పడిన స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీకి మొదటిసారిగా జరిగిన ఎన్నికలలో అత్యధిక స్థానాలలో విజయం సాధించి చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను దక్కించుకోవడం చాలా సంతోషంగా ఉందని వెల్లడించారు. ఈ పదవులతో పాటు మున్సిపాలిటీ అభివృద్ధిపై మా బాధ్యత కూడా పెరిగిందని అన్నారు. ఎన్నికల సమయంలో చెప్పినట్లుగా ప్రతీ వార్డుకు 2కోట్ల అభివృద్ధి నిధులు తీసుకువచ్చే బాధ్యత నాదని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేసిన నియోజకవర్గ ప్రజా ప్రతినిధులకు, నాయకులకు, కార్యకర్తలకు, కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## నీలకంఠేశ్వరుడికి భక్తులు నీరాజనం

**ప్రజాపక్షం/వేలేరు :** శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం వివిధ శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి ఉదయం నుంచి రాత్రి వరకు నీకంఠేశ్వరునికి భక్తులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు, పట్నాలతో మొక్కులు సమర్పించుకొని జాగరణ చేయగా మండలంలోని వేలేరు, మల్లికుదుర్ల, పీచర, కమ్మరిపేట గ్రామాలలోని సర్పంచ్‌లు పట్టువస్త్రాలు సమర్పించగా మల్లికుదుర్లలోని గట్టు మల్లికార్జునస్వామి ఆలయానికి మాజీ ఉపముఖ్యమంత్రి డా, టి, రాజయ్య, హనుమకొండ జిల్లా వైద్య రోగ్యశాఖఅధికారి డా. అప్పయ్య హాజరై మొక్కులు సమర్పించుకున్నారు. కార్యక్రమంలో ఇఒ అద్దంకి నాగేశ్వర్‌రావు, చైర్మన్ నిరంజన్‌రెడ్డి, సర్పంచ్‌లు బిల్ల యాదగిరి. జోడుముంతల కిరణ్, జక్కుల మౌనికసంపత్‌యాదవ్, మరిజె అనితనర్సింగారావు అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

## నర్సంపేటను మోడల్ సిటీగా తీర్చిదిద్దుతా!

**ప్రజాపక్షం/నర్సంపేట :** నర్సంపేట పట్టణానికి మోడల్ సిటిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి అన్నారు. నర్సంపేట మున్సిపాలిటిలో నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. మున్సిపాలిటి చైర్ పర్సన్‌గా పెండెం శ్రీలక్ష్మీ రామానంద్, వైస్ చైర్మన్‌గా గంధం నరేందర్‌లు ఏకగ్రీవంగా ఎన్నిక చేయడంతో ప్రమాణీకారోత్సవం చేపట్టారు. అనంతరం కౌన్సిలర్‌లతో ప్రమాణస్వీకారోత్సవాన్ని ఆర్డీవో ఉమారాణి చేయించారు. ఈసందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరై ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి నూతన పాలకవర్గాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. నర్సంపేట మున్సిపాలిటి పరిధిలోని 30వార్డులను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని, మోడల్ సిటిగా తీర్చిదిద్దడమే నా లక్ష్యమన్నారు. నూతనంగా కొలువుదీరిన పాలకవర్గం ప్రజా సమస్యలపై నిరంతరం దృష్టి పెట్టి అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు.

## గ్రామాల్లో మారుమోగిన శివనామస్మరణ

**ప్రజాపక్షం/నెక్కొండః** మహాశివరాత్రి సందర్భంగా వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని గ్రామాలు భక్తి పరవశంతో మారుమోగాయి. కాకతీయుల కాలం నాటి పురాతన శివాలయాల్లో భక్తులు శివనామ స్మరణతో ఆలయ ప్రాంగణాలను పవిత్ర తీర్థ క్షేత్రాలుగా మార్చారు. తెల్లవారుజామున 5గంటల నుండి హర హర మహాదేవ శంభో శంకర నినాదాలతో భక్తులు పూజా కార్యక్రమాలు ప్రారంభించి అర్ధరాత్రి వరకు కొనసాగించారు. మండలంలోని పనికర గ్రామంలో ఉన్న కాకతీయుల నిర్మాణ శైలిని ప్రతిబింబించే పురాతన శివాలయం పనికరలో భక్తులు స్వయంగా పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అలాగే పనికర, చంద్రుగొండ, గొల్లపల్లి గ్రామాల మధ్య వెలసిన శ్రీ మల్లికార్జునస్వామి దేవాలయంలో ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గొల్లపల్లి యాదవులు సాంప్రదాయబద్దంగా పెద్దపట్నం వేయడం విశేషంగా నిలిచింది. నాగారం, చిన్న కొరుపోలు, పెద్ద కొరుపోలు, దీక్షకుంట, చంద్రుగొండ, అప్పలరావుపేట, గ్రామాల పురాతన శివాలయాలు భక్తులతో కళకళలాడాయి. శివనామ స్మరణతో గ్రామాలు మారుమోగగా, భక్తి శ్రద్ధలతో నిర్వహించిన పూజా కార్యక్రమాలు ఆధ్మాత్మిక వాతావరణాన్ని సృష్టించాయి. మహాశివరాత్రి వేళ నెక్కొండ మండలం అంతా శివమయం అయ్యింది.

## వైభవంగా శివపార్వతుల కల్యాణం

**ప్రజాపక్షం/నర్సంపేట :** మహశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకోని పట్టణంలోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో ఆదివారం రాత్రి అయ్యప్పస్వామిదేవాలయ సేవ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శింగిరి కొండ మాధవ శంకర్ ఆధ్వర్యంలో ఆలయంలో అర్చకులచే శివపార్వతుల కల్యాణ అభిషేక మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈవేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ చైర్మన్ మాట్లాడుతూ ఆలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవం పంచలోహ విగ్రహాలు వచ్చే మండపంలో అలంకరించగా అర్చకులు కూడా రామకృష్ణ పవన్ ఆచార్యుల పూజా విధానంలో శివపార్వతుల కళ్యాణం నిర్వహించారు. ఈకార్యక్రమంలోఆలయ కమిటి అధ్యక్షులు సైఫా సురేష్, ప్రధాన కార్యదర్శి చింతల కమలాకర్ రెడ్డి, కోశాధికారి దొడ్డ రవీందర్, మాదారాపు చంద్రశేఖరం, ఇరుకుల్ల వీరలింగం, బండరుపల్లి చెంచారావు, దొడ్డ వేణు, మలయాళ రాజు, గురుస్వాములు, అర్చకులు, ఆలయ కమిటీ బృందం మేనేజర్ దేశ్ రాము, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో ఫలించని 'పద్మ' వ్యూహం...

**ప్రజాపక్షం/రామాయంపేట:**రామాయంపేట మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి వ్యూహం ఫలించలేదు. రామాయంపేట మున్సిపల్ ఎన్నికల్లో ఆపార్టీ అభ్యర్థుల పక్షాన స్వయంగా పద్మాదేవేందర్‌రెడ్డి రంగంలోకి దిగి పలు వార్డుల్లో విస్తృత ప్రచారం నిర్వహించినప్పటికి ఆమె ప్రచారం చేసిన ఒక్క వార్డులో ఒక్క అభ్యర్థి గెలవకపోవడం పార్టీ వర్గాల్లో ఆందోళన కలిగిస్తుంది. గతంలో బలమైన ప్రజాభిమానం, గెలుపు రికార్డులతో గుర్తింపు పొందిన పద్మాదేవేందర్‌రెడ్డి ఈసారి మాత్రం తన ప్రభావాన్ని చూపలేకపోయారనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఇంటింటా ప్రచారం, బారీ ర్యాలీలు, సమావేశాలు నిర్వహించినా ఓటర్లను ఆకట్టుకునేలా మాజీ ఎమ్మెల్యే వ్యూహం పనిచేయలేదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గత పదేళ్ల పాలనలో ఎంతో అభివృద్ధి చేశామని చెబుతుండగా స్థానికంగా టికెట్ల కేటాయింపుతో పాటు అప్పటికే గ్రౌండ్



సిద్ధం చేసుకున్న వారికి కాదని ఇతరులకు టికెట్లు కేటాయించడం కూడా పార్టీకి నష్టం జరిగిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మాజీ మంత్రి హరీష్ రావు సైతం రామాయంపేటలో సభ పెట్టి మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకుంటామని ప్రకటించినప్పటికి కేవలం మూడు స్థానాలతో సరిపెట్టుకోవాల్సివచ్చింది. ఎన్నికల ప్రచారంలో హరీష్‌రావు బిఆర్ఎస్ చేయని అభివృద్ధి పనులను కూడా చేశారని చెప్పడాన్ని స్థానికులు వ్యతిరేకిస్తున్నారు. మల్లె చెరువును సుందరీకరణ చేశామని, వీదిలైట్లు తామే వేశామని చెప్పడాన్ని ప్రత్యర్థి పార్టీలు అవకాశంగా మార్చుకొని అబద్ధపు మాటలను నమ్మవద్దని ప్రజలకు వివరించడంలో సఫలీకృతులయ్యారు. మున్సిపాలిటి ఏర్పాటు సందర్భంగా హరీష్‌రావు రామాయంపేటను దత్తత తీసుకుంటానని చెప్పి అభివృద్ధి చేయలేదనే నినాదాన్ని ప్రత్యర్థులు బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లారు. దీంతో హరీష్‌రావు వ్యూహం సైతం బెడిసికొట్టినట్లైంది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తానే ఎమ్మెల్యేగా చెప్పుకుంటున్న కంఠారెడ్డి తిరుపతిరెడ్డి ప్రచారం చేసిన మూడు వార్డుల్లో బిఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందడం విశేషం. రాబోయే ఎన్నికల్లో పార్టీ పునర్వ్యవస్థీకరణ, కొత్త నాయకత్వానికి ప్రాధాన్యం, స్థానిక సమస్యలపై దృష్టి పెట్టకపోతే పరిస్థితి మరింత క్లిష్టమయ్యే అవకాశం ఉంది. మొత్తంగా రామాయంపేట మున్సిపల్ ఎన్నికలు బిఆర్ఎస్ పార్టీకి గట్టి గుణపాఠం అయ్యాయనే చెప్పాలి.

## శివ్వంపేట గ్రామంలో మరిన్ని సేవలు..



**ప్రజాపక్షం/శివ్వంపేట:**శివ్వంపేట మండల కేంద్రంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతామని జిల్లా పరిషత్ మాజీ ప్రణాళిక సంఘం సభ్యులు, మాజీ జెడ్పీటిసి పబ్బ మహేష్‌గుప్తా అన్నారు. తన జన్మదినం సందర్భంగా గతంలో గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు శివ్వంపేటలోని 1వ వార్డులో మంచినీటి బోరును సోమవారం వేయించారు. ఈసందర్భంగా పబ్బ మహేష్‌గుప్తా మాట్లాడుతూ తమపై గ్రామస్తులు చూపిస్తున్న ఆదారాభిమానాలతో తన పుట్టిన గ్రామానికి మరింతగా సేవలందిస్తానని అన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచు రాజపేట వెంకటేశ్వర్, ఉపసర్పంచు ఇసుగారి మల్లేష్, మాజీ సర్పంచు శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీటీసీ విజయవెంకటేష్, బాసంపల్లి రామాగౌడ్, పైనం యాదగిరి, దడువాయి అశోక్, శేరిపల్లి నరేష్, బాసంపల్లి పోచాగౌడ్, ముయ్యడి ముత్యాలు, ముద్దగల్ల లక్ష్మీ నర్సయ్య, కొండల్, పత్రాల త్రినేష్‌గౌడ్, వర్గంటి రమేష్ కల్లూరి రాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఎక్స్ అఫీషియో ఓట్లతో ఇస్నాపూర్‌లో బిఆర్ఎస్‌కు చైర్మన్ పీఠం

**ప్రజాపక్షం/పటాన్‌చెరు:**ఇస్నాపూర్ మున్సిపాలిటీ చైర్మన్ ఎన్నికల్లో చివరి నిముషంలో రాజకీయంగా అనూహ్య పరిణామాలు చోటు చేసుకుని బిగ్ ట్విస్ట్ నమోదైంది. మున్సిపల్ చైర్మన్ ఎన్నికలకు ఎక్స్ అఫిషియో ఓటు వేయడానికి బిఆర్ఎస్ ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, బీజేపి ఎంపి రఘునందన్‌రావు ఒకే కారులో రావడం రాజయకీయ వర్గాల్లో చర్చనీయంశంగా మారింది. ఇక పార్టీల మధ్య క్రాస్ ఓటింగ్ కౌన్సిలర్ మార్పిడి ఎన్నికల మరింత ఉత్కంఠను తెచ్చింది. బిఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ క్యాంప్‌లో చేరిన 1 వార్డు కౌన్సిలర్ మమత కాంగ్రెస్ నుంచి గెలిచి బిఆర్ఎస్ గూటికి చేరిన 8వ వార్డు కౌన్సిలర్ పట్లోల మాదవి, నరేందర్ రెడ్డి కీలకంగా మారారు. అలాగే స్వతంత్రులుగా గెలిచిన ముగ్గురు కౌన్సిలర్లు కాంగ్రెస్ కండువా కప్పుగా ఓ స్వతంత్ర కౌన్సిలర్ బిఆర్ఎస్ లో చేరారు. ఈ పరిణామాలతో బిఆర్ఎస్ బలం 14కి కాంగ్రెస్ బలం 12 కి చేరింది. ఎక్స్ అఫిషియో ఓట్లు నిర్ణాయకంగా మారగా చివరకు బిఆర్ఎస్ అధిక్యం సాధించి ఇస్నాపూర్ పీఠాన్ని కైవసం చేసుకుంది. ఈ నేపథ్యంలో ఇస్నాపూర్ మున్సిపాలిటీ చైర్మన్ ,వైస్ చైర్మన్ పదవులను ఎట్టకేలకు బీఆర్ఎస్ దక్కించుకుంది. చైర్మన్‌గా మోటి సుమలత, వైస్ చైర్మన్‌గా పట్లోల మాదవి నరేందర్‌రెడ్డి, ప్రమాణ స్వీకారం చేశారు. మొత్తంగా చివరి నిమిషం కదలికలు ఎక్స్ అఫీషియా ఓట్ల ప్రభావంతో ఇస్నాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాప్‌గా మారింది .

## దుబ్బాక మున్సిపాలిటీ చైర్ పర్సన్‌గా శ్రీరాం సంగీత

**ప్రజాపక్షం/దుబ్బాక:** దుబ్బాక మున్సిపల్ పీఠాన్ని బిఆర్ఎస్ కైవసం చేసుకుంది. దుబ్బాక మున్సిపాలిటీ ఎన్నికల్లో గెలిచిన కౌన్సిల్ సభ్యులతో సోమవారం ఉదయం 11 గంటలకు ప్రమాణ స్వీకారం చేశారు. సిద్ధిపేట ఆర్డీవో సదనందం ఆధ్వర్యంలో 20 మంది కౌన్సిలర్లు ప్రమాణస్వీకారం చేశారు. బిఆర్ఎస్ పార్టీ చెందిన 12 వ వార్డు కౌన్సిలర్ బండి శ్రీలేఖ, 19 వ వార్డు కౌన్సిలర్ శ్రీరాం సంగీత చైర్ పర్సన్ రేసులో ఉండగా, చైర్ పర్సన్ ఎవరికి దకుతుందనే దానిపై ఏర్పడిన ఉత్కంఠ ఎట్టకేలకు సోమవారం వీడింది. దుబ్బాక చైర్ పర్సన్ గా శ్రీరాం సంగీతను బిఆర్ఎస్ అధిష్ఠానం ఎంపిక చేసింది. బిఆర్ఎస్ పార్టీకి 11, కాంగ్రెస్ పార్టీ 4, స్వతంత్ర అభ్యర్థులు ఇద్దరు, ఏఐఎఫ్‌బి 1, బిజెపి 2లచే ఆర్డీవో ప్రమాణ స్వీకారం చేశారు. స్వతంత్ర అభ్యర్థులు ఇద్దరు ఏఐఎఫ్‌బి చెందిన ఒక్కరు బిఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలిపారు. సమావేశంలో చైర్ పర్సన్ పదవికి పేరును సీల్ కవర్‌ను అధికారులు తెరచి అందులో ఉన్న పేర్లను చదివి వినిపించారు. చైర్ పర్సన్‌గా 19 వ




వార్డు కౌన్సిలర్ శ్రీరాం సంగీత ను 11 వ వార్డు కౌన్సిలర్ నందాల శ్రీకాంత్ ప్రతిపాదించగా 4 వ వార్డు కౌన్సిలర్ అధికం బాలకిషన్ బలపరిచారు. వైస్ చైర్ పర్సన్ ఆశ సులోచనగా కౌన్సిలర్లు ప్రతిపాదించి, బలపరిచారు. పోటీ ఎవరూ లేకపోవడంతో చైర్ పర్సన్‌గా శ్రీరాం సంగీత, వైస్ చైర్ పర్సన్‌గా ఆశ సులోచనలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. అనంతరం చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్‌లతో ప్రమాణ స్వీకారం చేయించి, అధికార ధృవీకరణ పత్రాలు అందజేశారు.

## నేడు సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేసీఆర్ జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/కొండాపూర్:**తెలంగాణ తొలి ముఖ్యమంత్రి బిఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర్‌రావు జన్మదిన సందర్భంగా నేడు ( మంగళవారం రోజు 17వతేదీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించబడునని విఠల్ బిఆర్ఎస్ పార్టీ కొండాపూర్, మండల అధ్యక్షులు, గోవర్ధన్ బిఆర్ఎస్ పార్టీ కొండాపూర్ మండల కార్యదర్శి తెలిపారు. అనంతరం సంగారెడ్డి, పట్టణ బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన కౌన్సిలర అభ్యర్థులకు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ చేతుల మీదుగ సన్మాన కార్యక్రమం నిర్వహించబడునని , ఈ కార్యక్రమం సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో ఉదయం 10.30 గంటలకు బిఆర్ఎస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు ప్రజా ప్రతినిధులు సర్పంచ్‌లు మాజీ ప్రజా ప్రతినిధులు ,అభిమానులు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వీరు ఆకాంక్షించారు.

## అందరి సహకారంతో పట్టణ అభివృద్ధికి కృషి చేస్తా

**ప్రజాపక్షం/హుస్నాబాద్:**హుస్నాబాద్ మున్సిపల్‌ను అందరి సహకారంతో పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని హుస్నాబాద్ నూతన మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మికొంరయ్యలు అన్నారు. సోమవారం హుస్నాబాద్ నూతన పాలక వర్గం ప్రమాణస్వీకారం దండి లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికై సందర్భాగా ఆమె మాట్లాడుతూ తెలంగాన బి సి రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడు సహకారంతో పార్టీలకు అతీతంగా నూతన పాలక వర్గంతో కలిసి పట్టణంలోని ఉన్న 20 వార్డుల్లో అభివృద్ధికి కృషిచేస్తానని దండిలక్ష్మి అన్నారు. పట్టన ప్రజలకు అందుబాటులో ఉంటు వాటి పరిష్కారాం కోసం మంత్రి దృష్టికి తీసికెల్లి సమస్యలను పరిష్కారించి పట్టణ ప్రజలకు అభివృద్ధిని కల్లముందు ఉంచుతాన్ని అన్నారు. ముఖ్యంగా పట్టణ ప్రజలకు మంచి నీటి సమస్య , పరిశుభ్రత, దృష్టిపెట్టి వాటి నివారణకు ఎప్పటికప్పుడు కృషి చేస్తామన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించడం లాంటి వాటిని ప్రజలకు అందే విధంగా చూస్తామని అన్నారు. ప్రజాపాలనలో ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అనేక సంక్షేమ పథకాలను పేదలకు అందే విధంగా కృషిచేస్తామన్నారు.

## సిఎం కప్ ఆర్చరీలో రాష్ట్ర స్థాయికి ఎంపిక...

**ప్రజాపక్షం/సిద్దిపేటఅర్బన్:**సిఎం కప్ క్రీడా పోటీలలో భాగంగా సిద్దిపేట జిల్లా స్థాయిలో జరిగిన ఆర్చరీ పోటీలలో సిహెచ్ రశ్మితారెడ్డి,పాతూరి హేమంత్‌రెడ్డిలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనారు. జిల్లా స్థాయిలో బాలుర విభాగంలో పాతూరి హేమంత్‌రెడ్డి,బాలికల విభాగంలో రశ్మితారెడ్డిలు అత్యధిక ప్రతిభను కనబరిచి గోల్డ్ మెడల్లు



సాధించారు. వీరు ఇరువురు ఈ నెల 19వ తేదీ నుండి ఖమ్మంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారు. ఈ సందర్భంగా ఆర్చరీ కోచ్ డాక్టర్ రవిశంకర్ వారిని అభినందించారు.

## దీశుల కోట నుండి ఏడుపాయలకు బయలుదేరిన జాతర బండి



**ప్రజాపక్షం/పాపన్నపేట:**పాపన్నపేట సంస్థాన్ దీశుల కోట నుండి పుణ్య క్షేత్రమైన ఏడుపాయల వన దుర్గ భవాని అమ్మ వారి క్షేత్రానికి జోడెడ్ల జాతర బండి సోమవారం ఉదయం బయలు దేరింది. ఏడుపాయల మహా జాతరలో రెండవ రోజు జాతరబండ్ల ఊరేగింపు ఉండగా, జాతర లో మొదటి బండి సంస్థాన్ పాపన్నపేట ది ఈ బండి ఆనవాయితీ ప్రకారం పాపన్నపేట కోట నుండి ఏడు పాయల క్షేత్రానికి జాతర బండి బయలుదేరగా ఈ ఊరేగింపులో పాపన్నపేట గ్రామస్తులతో పాటు మండల వాసులు వేలాధి సంఖ్యలో పాల్గొన్నారు. పోలీస్ రెవెన్యూ పర్యవేక్షణలో జాతర బండి బయలుదేరింది. బండి ఊరేగింపులో పోతరాజుల విన్యా సాలు, యువకుల నృత్యాలు, శివసత్తుల సిగాలు, ఉగుతుండగా భక్తుల భక్తి పరవశంతో నిండు నీళ్ల బిందెలతో బండి ముందు చల్లి, టెంకాయలు కొడుతూ, మొక్కులు తీర్చుకొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నీటి ట్యాంకుల నిర్మాణానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/రామాయంపేట:**మండలంలోని ఆర్.వెంకటాపూర్ గ్రామంలో మంచినీటి ఎద్దటి తీర్చేందుకు ఐదు ప్రాంతాల్లో నీటి ట్యాంకుల నిర్మాణానికి సోమవారం సర్పంచ్ ఉమా సంజీవరెడ్డి శంఖుస్థాపన చేశారు. గ్రామంలోని రామాలయం ముందు, ఎస్సీ కాలనీ, స్మశానవాటిక, దళితవాడ, హిందూ స్మశానవాటిక, పిట్టల వాడలో మిని ట్యాంకుల నిర్మాణం చేపడుతున్నట్లు సర్పంచు తెలిపారు. గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుల సహకారంతో ముందుకు సాగుతామన్నారు. అన్ని వర్గాల ప్రజల మద్దతుతో ముందుకు వెళ్తామన్నారు. రాజకీయాలకు తాను కొత్తగా వచ్చినా అభివృద్ధి విషయంలో వెనుకడుగు వేసే ప్రసక్తిలేదన్నారు. ఎన్నికలకు ముందు తాను ఇచ్చిన హామీలను దశలవారిగా పూర్తి చేస్తానన్నారు. గ్రామాభివృద్ధికి ప్రజలు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్న కొంతమందిని గ్రామస్తులే చూసుకుంటారన్నారు. జిల్లాలోనే ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దడానికి తాను శాశ్వత ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ప్రకటించారు. ఈకార్యక్రమంలో ఉపసర్పంచు అనురాధ నరేష్, వార్డు సభ్యులు గట్టయ్య, స్వామి, ఎల్లం, నాగరాణితో పాటు సంజీవరెడ్డి, సిద్ధరాం రెడ్డి, ఇంద్రసేనారెడ్డిలు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ రాజరాజేశ్వర స్వామి జాతర ఉత్సవాలు



**ప్రజాపక్షం/మనోహరాబాద్:**మండలంలోని లింగారెడ్డి పేట గ్రామంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి జాతర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. సోమవారం సర్పంచ్ శివగాని పెంట గౌడ్ ఆధ్వర్యంలో వేద పండితులచే స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తుల కోసం దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకుని, ముక్కులు చెల్లించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పార్టీలకు అతీతంగా గ్రామస్తులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఖాతాలో మూడు చైర్మన్లు, బిఆర్ఎస్ ఖాతాలో ఒకటి

## రెండు చోట్ల బిజెపితో దోస్తీ కట్టిన కాంగ్రెస్
## మెదక్ లో ఎక్స్ అఫీషియో ఓటుతో చైర్మన్ పీఠం

**ప్రజాపక్షం/మెదక్:** మెదక్ జిల్లాలో గత మూడు రోజులుగా మదక్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు జరుగుతున్న ఉత్కంఠకు తెరపడింది. జిల్లాలో ఉన్న మెదక్, నర్సాపూర్, తూప్రాన్, రామయంపేట్ నాలుగు మున్సిపాలిటీలకు ఎన్నికలు జరుగగా రామాయంపేటలో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచి పీఠం దక్కించుకున్నారు. తూప్రాన్ మున్సిపాలిటీలో బిఆర్ఎస్ జెండా ఎగరేసింది. నర్సాపూర్, మెదక్ మున్సిపాలిటీలో అధికార కాంగ్రెస్ పార్టీకి, బిఆర్ఎస్ పార్టీకి సమానంగా సీట్లు రావడంతో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు సందిగ్ధం నెలకొంది. దీంతో కాంగ్రెస్ పార్టీ, బిజెపి తో పోత్తు పెటుకోని నర్సాపూర్ పీఠాన్ని అలంకరించింది. మెదక్ మున్సిపల్ లో కాంగ్రెస్ పార్టీ, బిజెపి పార్టీతో దోస్తీ కట్టి స్థానిక ఎమ్మెల్యే ఎక్స్ అఫీషియో ఓటుతో మెదక్ బల్దియా చైర్మన్ పీఠాన్ని దక్కించుకుంది. బద్ధ శత్రువులైన కమలం, హస్తం పార్టీలు పోత్తు కుదురుచుకోడంపై జిల్లా వ్యప్తంగా చర్చనీయ అంశాంగా మారింది. మెదక్ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం ప్రెసిడింగ్ అధికారి జెడ్పి సీఈఓ ఎల్లయ్య, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి ఆద్వర్యంలో జరిగింది.



అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు జరిగాయి. చైర్మన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుచుకున్న 14మంది కౌన్సిలర్లతో పాటు బీఎస్పీ 01, ఎమ్మెల్యే రోహిత్ రావు ఎక్స్ అఫీషియో ఓటుతో చైర్మన్ పీఠన్ని కాంగ్రెస్ పార్టీ చేజిక్కించుకుంది. ముందుగా 32 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేపట్టారు. తర్వాత నిర్వహించిన చైర్మన్ ఎన్నికలకు 24 వ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కానుగు రాధిక ను మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా 20వ వార్డు కౌన్సిలర్ మన్సూర్ ప్రతిపాదించారు. అందుకు 19వ వార్డు కౌన్సిలర్ గంట సంపత్ బలపరిచారు. కాంగ్రెస్ పార్టీ తరపున 14 మంది కౌన్సిలర్లు ఒక బీఎస్పీ కౌన్సిలర్ ఎక్స్ అఫీషియో సభ్యుడు ఎమ్మెల్యే రోహిత్ రావు చేతులెత్తి బలపరిచారు. బిజెపి సభ్యులు ఎన్నిక సమయంలో లేకపోవడంతో 30 మంది సభ్యులలో ఎమ్మెల్యే ఓటుతో కలిపి 16 ఓట్లు కాంగ్రెస్ అభ్యర్థి గెలుపొందినట్టుగా ఎన్నికతల అధికారులు ప్రకటించారు. బిఆర్ఎస్ పార్టీ తరపున మూడో వార్డు కౌన్సిలర్ కొట్టాల లలితను ఆ పార్టీ కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయులు ప్రతిపాదించారు. వారికి సరిపోయిన అన్నిఓట్లు లేకపోవడంతో ముందుగా 16 ఓట్లు వచ్చిన కానుగు రాధికను మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికైనట్లుగా అధికారులు ప్రకటించారు. అనంతరం బిఆర్ఎస్ కౌన్సిలర్లు సమావేశ మందిరం నుండి బయటకు వెళ్లిపోయారు. కోరం ఉన్నందున వైస్ చైర్మన్ ఎన్నికను ఎన్నికల అధివారులు చేపట్టారు. 15 వార్డు అభ్యర్థి వైస్ చైర్మన్ అభ్యర్థి దొంతి నరేష్ గౌడ్ ను 30 వార్డు కౌన్సిలర్ అరుణార్థి వెంకటరమణ ప్రతిపాదించారు. 31 వార్డు కౌన్సిలర్ తోడుపునూరి శివరామకృష్ణ బలపరిచారు. దీంతో వైస్ చైర్మన్ గా దొంతి నరేష్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్ కానుగు రాధిక దొంతి నరేష్ గౌడ్ లను ఎమ్మెల్యే రోహిత్ రావు ఘనంగా సత్కరించారు. మెదక్ జిల్లా లోని తూప్రాన్ మున్సిపాలలిటీ లలో బిఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీ పై జెండా ఎగురవేసింది. బిఆర్ఎస్ పార్టీకి చెందిన మున్సిపల్ చైర్మన్ గా కొక్కొండ సమతా కాశిరెడ్డిలను ఎన్నుకున్నారు. రామాయంపేట చైర్మన్ గా లావణ్య నాగరాజు, వైస్ చైర్మన్ గా పోచమ్మల నవనీత గణేష్ లు ఎన్నికయ్యారు. నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ గా మాచునూరి లక్ష్మీ రాజు, వైస్ చైర్మన్ గా ఎన్నికయ్యారు.

# అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు శంకుస్థాపన



**ప్రజాపక్షం/మనోహరాబాద్:** మనోహరాబాద్ మండలంలోని పాలాట గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సర్పంచ్ నీలం సాయికుమార్ గౌడ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామంలో పెండింగ్‌లో ఉన్న పనులకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని వారు తెలిపారు. ఇందులో భాగంగా సుమారు మూడు లక్షల రూపాయలతో సోమవారం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించినట్లు వారు తెలిపారు. గ్రామంలో ఎలాంటి సమస్య ఉన్న పాలకవర్గ సభ్యులకు తెలియజెయాలని సూచించారు. గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రావణి, పాలకవర్గ సభ్యులు, గ్రామపంచాయతీ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రామాయంపేట ప్రజల రుణం తీర్చుకుంటాం....



**ప్రజాపక్షం/రామాయంపేట:** రామాయంపేట పట్టణ ప్రజల ఋణం తీర్చుకుంటామని మున్సిపల్ చైర్ పర్సన్‌గా ఎన్నికైన గజవాడ లావణ్య నాగరాజు అన్నారు. సోమవారం నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం అనంతరం పట్టణ పురవీదుల గుండా చేపట్టిన విజయోత్సవ ర్యాలీలో ప్రజల హర్షద్యానాలతో మార్మోగాయి. బారీ వాహనంలో పాలవవర్గ సభ్యులు విజయోత్సవ ర్యాలీలో పాల్గొనగా వారికి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై అభినందనలు తెలిపారు. పార్టీ జెండాలు, నినాదాలతో పట్టణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ ప్రజలు మాపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటామని, అభివృద్ధి పారదర్శక పాలన అందించడమే తమ లక్ష్యమన్నారు. ఈకార్యక్రమంలో నూతన పాలకవర్గంతో పాటు కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ మహిపాల్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా పని చేయాలి

**ప్రజాపక్షం/గజ్వేల్:** గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ నూతన చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్మన్ పద్మాబాయి నర్సింగ రావు కౌన్సిలర్ల బృందానికి సోమవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జఖియిద్దిన్ , మాజీ జెడ్పిటిసి డాక్టర్ మల్లేశం తదితరులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు శాలువాలతో సత్కరించి నూతన పాలక వర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. గులాబీ అధిపతి కెసిఆర్ ఆదేశాల మేరకు పేదలకు మంచి చేయాలని కోరారు. రాష్ట్రంలోనే గజ్వేల్ నియోజకవర్గం అత్యంత ప్రతిష్టాత్మకమైనదని ఈ సందర్భంగా వారు గుర్తు చేస్తూ నిరంతరం ప్రజాసేవలో నిమగ్నం కావాలని వివరించారు.

# మున్సిపల్ కౌన్సిల్ సభ్యుల ప్రమాణ స్వీకారం

**ప్రజాపక్షం/రామాయంపేట:** రామాయంపేట మున్సిపాలిటికి జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన కౌన్సిలర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం మున్సిపల్ కార్యాలయంలో అట్టహాసంగా జరిగింది. తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, నర్సాపూర్ డిఎల్‌పివో సాయిబాబాల సమక్షంలో సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఎన్నికైన సభ్యులచేత అక్షరమాల పద్ధతిలో కొక్కు ప్రవీణ్‌కుమార్ (బిఆర్ఎస్), గజవాడ నాగరాజు (కాంగ్రెస్), గజవాడ లావణ(కాంగ్రెస్), గుగ్లోత్ రవి (కాంగ్రెస్), చౌదరి చరిత (బిఆర్ఎస్), జంగంపల్లి శివశంకర్ (బిజెపి), దాకి శ్యామల (కాంగ్రెస్), పుట్టి సందీప్ (కాంగ్రెస్), పోచమ్మల నవనీత (కాంగ్రెస్), బైరం స్వప్న (కాంగ్రెస్), మద్దెల మాదవి (బిఆర్ఎస్) సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం చైర్ పర్సన్‌కు జరిగిన ఎన్నికల్లో 1వ వార్డు సభ్యురాలు గజవాడ లావణ్య నాగరాజును 4వ వార్డు సభ్యురాలు బైరం స్వప్న ప్రతిపాదించగా 9వ వార్డు సభ్యులు దేవుని రంజిత్ బలపరిచారు. ఒక్కటే నామినేషన్ రావడంతో గజవాడ లావణ్య నాగరాజు చైర్ పర్సన్‌గా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి జయచంద్రారెడ్డి ప్రకటించారు.



అనంతరం వైస్ చైర్ పర్సన్‌కు జరిగిన ఎన్నికల్లో 12వ వార్డు సభ్యురాలు పోచమ్మల నవనీత గణేష్‌ను 11వ వార్డు సభ్యురాలు దాకి శ్యామల ప్రతిపాదించగా 7వ వార్డు సభ్యులు గజవాడ నాగరాజు బలపరిచారు. వైస్ చైర్ పర్సన్‌కు కూడా ఒక్కటే నామినేషన్ రావడంతో పోచమ్మల నవనీత గణేష్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి జయచంద్రారెడ్డి ప్రకటించారు. ఈసందర్భంగా నూతన సభ్యులను అధికారులు సన్మానించారు. ఈసందర్భంగా నూతన పాలకవర్గం మాట్లాడుతూ తమపై నమ్మకంతో గెలిపించిన రామాయంపేట పట్టణ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి ప్రతి సమస్యను పరిష్కరించడంతో పాటు పట్టణ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

# వట్పల్లిలోని ఆధ్యాత్మిక కేంద్రం దర్గాను సందర్శన



**ప్రజాపక్షం/సంగారెడి:** సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలి కేంద్రంలోని ప్రముఖ ఆద్యాత్మిక కేంద్రం దర్గా ఏ హజ్ర్ సయ్యద్ షా ఖ్వాజా దాస్ ఖాజా షరీఫ్ 40 వ వార్షిక ఆరాదన మహోత్సవం (ఉర్సు ఉత్సవం) లో రాష్ట్ర వైద్యారాగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొన్నారు. వట్పల్లి మండల కేంద్రంలో ఉన్న ఖ్వాజీ షరీఫ్ దర్గా ను దర్శింపకున్నారు. షరీఫ్ దర్గా కు చద్దర్‌ను సమర్పించారు. దర్గాలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం సామూహిక భోజనశాలలో నేలపై కూర్చోని భక్తులతో కలిసి మంత్రి దామోదర్ రాజనర్సింహ సహపంక్తి భోజనం చేసి తన నిరాడంబరాన్ని చాటారు.

# మంత్రి దామోదర్‌ను కలిసిన నూతన చైర్మన్, వైస్ చైర్మన్‌లు

**ప్రజాపక్షం/సంగారెడ్డి:** అందోల్ జోగిపేట మున్సిపాలిటీ నూతన చైర్మ్‌గా నియమితులైన కృష్టారెడ్డి, వైస్ చైర్మన్ సత్యనాయణ (చిట్టీబాబు) కాంగ్రెస్ పార్టీ కౌన్సిరల్ సభ్యులు నూతనంగా ఎన్నికై పదవి ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ జోగిపేట లో మార్యదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్ సభ్యులకు మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సేవలను అందించాలని దిశ నిర్దేశం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.



సామాన్యుడికి ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలు చేరేలా మున్సిపల్ కౌన్సిలర్ సభ్యులు కృషి చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచించారు.

# భూమాతతో రైతులకు ఒరిగింది ఏమి లేదు

**ప్రజాపక్షం/గోవిందరావుపేట:** సోమవారం రోజున సిపిఎం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం గుండు రామస్వామి అధ్యక్షతన జరిగింది ఈ సమావేశానికి తుమ్మల వెంకటరెడ్డి హాజరై మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఆర్పాటంగా ప్రవేశపెట్టిన భూమాత నిరుపయోగంగా మారిందని అన్నారు తెలంగాణ రాష్ట్రంలో 9లక్షల మంది పట్టా సర్టిఫికెట్లు కోసం దరఖాస్తు చేసుకున్నారని ఆయన తెలిపారు గత ప్రభుత్వం ధరణి వల్ల ఏ ఒక్క రైతుకు న్యాయం జరగలేదని అన్న కాంగ్రెస్ భూమాత తీసుకువచ్చి రైతుందరికి న్యాయం చేస్తామని ఎన్నికల ముందు ప్రకటించి రెండు సంవత్సరాలు అయినా ఏ ఒక్క రైతుకి న్యాయం చేయలేదని ఆయన విమర్శించారు ఫెలట్ ప్రాజెక్టుగా తీసుకున్న వెంకటాపూర్ మండలంలో సైతం ఒక రైతుకి అవకాశం లేదని అన్నారు. పహానిలో పట్టేదారు కాలంలో యజమాని ఒప్పుకుంటే ఇస్తామనడం రైతులను మోసం చేయడమేనని పేర్కొన్నారు ఈ నిబంధన వల్ల ఏ రైతుకి పాస్బుక్ రాలేదని ఆయన తెలిపారు రైతు ప్రభుత్వం అని చెప్తూ ఈ రోజు రైతులకు తీరని నష్టం చేసిందని ఆయన మండిపడ్డారు

# చల్మనాయ గుట్ట జాతరలో ఎల్లమ్మ బోనాల ఊరేగింపు

**ప్రజాపక్షం/మనోహరాబాద్:** మనోహరాబాద్ మండలంలోని చెట్లగౌరారం గ్రామంలో మహాశివరాత్రి నీ పురస్కరించుకొని చల్మనాయ స్వామి జాతర అంగరంగ వైభవంగా జరుగుతున్నట్లు సర్పంచ్ దివ్య శ్రీహరి గౌడ్ తెలిపారు. మొదటి రోజు ఆదివారం ఉపవాస దీక్షలు,అభిషేకాలు నిర్వహించగా, రెండవ రోజు చల్మనాయ గుట్ట పై జరిగే జాతర సందర్భంగా సోమవారం రుద్రాభిషేకం,పాలాభిషేకం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రేణుక ఎల్లమ్మకు బోనాల ఊరేగింపు, శివసత్తుల, పోతరాజుల విన్యాసాల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు, ప్రజా ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రుద్రేశ్వరాలయంలో శివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు..

**ప్రజాపక్షం/కొండపాక:** రుద్రేశ్వరాలయంలో జరుగుతున్న శివరాత్రి వార్సిన బ్రహ్మోత్సవాలు సోమవారం మహ అన్నదాన కార్యక్రమంలో ముగిశాయి.ఉత్సవాల్లో భాగంగా ఇదివారం శివపార్వతుల కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు.అనంతరం అన్న ప్రసాద వితరణ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మెన్ అనంతల శమ్మోహన్,కార్యదర్శి వెంకటరమణ శర్మ, బాలయ్య, కనక రాములు, రామకృష్ణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సిరిసిల్ల మున్సిపల్‌పై బిఆర్ఎస్ జెండా

**ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్ల:** సిరిసిల్ల మున్సిపల్ చైర్మన్ గా జిందం కల చక్రపాణి, వైస్ చైర్మన్ గా దార్ల సందీప్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం సిరిసిల్ల పురపాలక సంఘ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేసి పదవి బాధ్యతలు చేపట్టారు. సిరిసిల్ల మున్సిపల్ లో 39 కౌన్సిలర్ అభ్యర్థులకు గాను 27 బిఆర్ఎస్ కౌన్సిల్ సభ్యులు గెలుపొందడంతో చైర్మన్ పీఠానికి బలం చేకూరింది. సిరిసిల్ల మున్సిపల్ పై బి ఆర్ ఎస్ జెండాను ఎగరవేశారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు అత్యంత సన్నిహితుడుగా, పార్టీలో సీనియర్ నాయకులుగా ఉన్న జిందం కలచక్రపాణి మూడవ వార్డు కౌన్సిలర్ పోటీ చేసి గెలుపొంది రెండవసారి చైర్మన్ పదవి చేజెక్కించుకున్నారు. పార్టీ అధిష్టానం అన్ని విధాలుగా చర్చించి కేటీఆర్ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా వీరు మద్దతు తెలిపిన కౌన్సిలర్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సిరిసిల్ల అభివృద్ధే మరొకసారి బిఆర్ఎస్ కు పట్టం కట్టిందన్నారు. 39 వార్డ్ సభ్యుల సమన్వయంతో సిరిసిల్లను మరింత అభివృద్ధి చేస్తూ రాష్ట్రంలోనే ఉత్తమ మున్సిపాలిటీగా తీర్చి దిద్దుతామన్నారు.

## హనుమాన్ దేవాలయంలో పూజా సామాగ్రి బహిరంగ వేలం

**ప్రజాపక్షం/ వేములవాడ:** వేములవాడ మండలం అగ్రహారం శ్రీ హనుమాన్ దేవాలయంలో కొబ్బరికాయలు, పూజా సామాగ్రి, దీక్ష వస్త్రాలు అమ్ముకొనుటకు గాను ఫిబ్రవరి 19న టెండర్ కం బహిరంగవేల నిర్వహిస్తున్నట్లు ఈవో ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలం ఒక సంవత్సరం కాలపరిమితి ఉంటుందని, దీనికి షెడ్యూలు ఖరీదు ఐదు వందలని డిపాజిట్ సొమ్ము ఏడు లక్షల రూపాయలని. ఈ నెల19న ఉదయం 10 గంటలకు వేలం నిర్వహించబడుతుందని ఆలయ ఈవో ఉడుతల వెంకన్న తెలిపారు. మిగతా సమాచారం కొరకు కార్యాలయ నందు సంప్రదించాలని తెలిపారు.

## శివనామస్మరణతో మారుమోగిన గ్రామాలు

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా జగిత్యాల రూరల్ మండలంలోని పొలస గ్రామంలోనీ శ్రీ పొలస్తేశ్వర స్వామి,హబ్సీపూర్ గ్రామంలోని శ్రీ నాగముని లింగేశ్వర స్వామి ఆలయంలలో శివరాత్రి వేడుకలలో భాగంగా శివపార్వతుల రథోత్సవం సోమవారం ఎంతో వైభవంగా నిర్వహించారు.అధికసంఖ్యలో భక్తులు పాల్గొని రథోత్సవ కార్యక్రమాన్ని ఆ శివ పార్వతులను భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు.రథోత్సవ కార్యక్రమంలో మంగళవాయిద్యాలు మహిళలు, చిన్న పిల్లల నృత్యాలు చేస్తూ ఉత్సవ మూర్తులను రథంపై ఊరేగింపు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పొలస ఆలయ కార్యనిర్వహణ అధికారి సురేందర్, ఆలయ చైర్మన్ భారతపు భూమన్న, సర్పంచులు మిల్కురీ శంకర్, ఇండ్ల జమున రాజేందర్, గ్రామ నాయకులు ముస్కు దామోదర్ రెడ్డి, రాజేందర్, పొలస ఆలయ ధర్మకర్తలు, ఆలయల కమిటీ సభ్యులు,అర్చకులు, సిబ్బంది, పోలాస, హబ్సీపూర్ గ్రామాల ప్రజలు,యువకులు, మహిళలు,తదితరులు పాల్గొన్నారు.

# సిఎం మొదలుపెట్టిన ఆటకు ముగింపునిస్తా

### కేంద్ర మంత్రి బండి సంజయ్

**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:**‘‘సీఎం రేవంత్‌రెడ్డి గారూ.. మెజారిటీ సీట్లను సాధించిన బిజెపికి మేయర్, డిప్యూటీ మేయర్ పదవి దక్కకుండా మంత్రులు, బిఆర్ఎస్, ఎంఐఎంతో కలిసి మీరు చేయని కుట్రలు లేవు.. అయినా బండి సంజయ్ రాజకీయం ముందు, బిజెపి సైనికుల పోరాట పటిమ ముందు మీ కుట్రలన్నీ పటాపంచలైనయ్.. క్రికెట్‌లో ఇండియాపై పాకిస్తాన్ ఘన విజయం సాధించినట్లుగానే కరీంనగర్ మున్సిపల్ ఎన్నికల కబడ్డీ ఆటలో మీ అందరినీ ఓడించి బిజెపి కప్ గెలుచుకుంది. ఈ వేదికపై ఇప్పుడు చెబుతున్నా.. మీరు అనవసరంగా అప్రజాస్వామికంగా నన్ను కెలికి ఆట మొదలుపెట్టారు. ఇక మీ ఆటకు నేను ముగింపు ఇస్తా’’ అంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సీఎం రేవంత్‌రెడ్డికి అల్టిమేటం ఇచ్చారు. సోమవారం కరీంనగర్‌లో మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక అనంతరం నూతనంగా ఎన్నికైన మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్‌రావు, బిజెపి కార్పొరేటర్లతో కలిసి మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా కాంగ్రెస్, బిఆర్ఎస్, ఎంఐఎం పార్టీలన్నీ ఒక్కటై ఫాంహౌజ్ వేదికగా కుట్రలు చేశారన్నారు. కాంగ్రెస్‌కు మ్యాజిక్ ఫిగర్ దాటకున్నా బిజెపిని అడ్డుకునే ప్రయత్నం చేయడంలో కాంగ్రెస్ పన్నిన చీకటి ఒప్పందాలేమిటని ప్రశ్నించారు. కరీంనగర్ కార్పోరేషన్‌పై కాషాయ జెండా ఎగురవేయాలన్న ఎన్నో కలను సాకారమవడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో అధికార మార్పిడి జరగాలన్నా, తెలంగాణ వచ్చునా కరీంనగర్ వేదికగా మార్పు మొదలైందన్నారు. అందులో భాగంగా కరీంనగర్ మేయర్ పదవిని బిజెపి కైవసం చేసుకుంటే రాష్ట్రంలోనూ బిజెపి అధికారంలోకి రావడం తధ్యమనే భయంతో కాంగ్రెస్, బిఆర్ఎస్, మజ్లిస్ పార్టీలన్నీ ఒక్కటై కుట్ర చేశాయన్నారు. ప్రజల సహకారం, అమ్మవారి ఆశీస్సులతో ఆ కుట్రలన్నీ భగ్నం చేశామన్నారు. కేంద్రం నుంచి అత్యధిక నిధుల తీసుకు వచ్చి అశభివృద్ధి చేసేందుకు యత్నిస్తానన్నారు. బిఆర్ఎస్ కార్పొరేటర్లు ప్రజాస్వామ్య తీర్పును శిరసావహించాలనే ఉద్దేశంతో పార్టీ తీసుకున్న నిర్ణయం గొప్ప విషయమని అభినందించారు.

## హుజురాబాద్ మున్సిపల్ పీఠంపై ఎగిరిన కాంగ్రెస్ జెండా



**ప్రజాపక్షం / హుజురాబాద్ :**హుజురాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయఢంకా ఎగురవేసింది. కొన్ని దశాబ్దాల తరువాత కాంగ్రెస్ పార్టీకి విజయ తిలకాన్ని దిద్దారు. హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ ఎన్నికలు ప్రారంభమైన నాటి నుండి అభ్యర్థుల ఎంపికలో ఆచూతూచీ వ్యవహరిస్తూ, ఈ సారి ఎలాగైనా హుజురాబాద్‌లో జెండా ఎగురవేయాలని పట్టుదలతో ఉండి విజయ యాత్రను కొనసాగించారు. సోమవారం నాడు హుజురాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులు ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం చైర్మన్‌గా రొంటాల సుహాసిని, వైస్ చైర్మన్‌గా గూడూరి అంజలి ఎన్నికైయ్యారు. అనంతరం జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేనవీన్ యాదవ్, ప్రణవ్ ర్యాలీగా బయలుదేరి అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే నవీన్ యాదవ్, ప్రణవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజలకు దగ్గరై ఇటీవల జరిగిన అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసిందని, ఇకపై హుజురాబాద్‌లో ఏ ఎన్నిక జరిగినా ఎగిరేది కాంగ్రెస్ జెండానే అని వారు అన్నారు.

సర్పంచ్ ఎన్నికల్లో బిజెపి, బిఆర్ఎస్ ఒక్కటైనా కాంగ్రెస్ పార్టీ విజయాన్ని ఆపలేకపోయారని, ఇప్పుడు జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో సొంతంగానే జెండా ఎగురవేసినట్లు, వచ్చే ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికల్లో ఇదే విజయం పునరావృతం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ కాంగ్రెస్ శ్రేణుల భారీగా హాజరయ్యారు.

# వేములవాడ మున్సిపల్ కాంగ్రెస్ కైవసం

### మున్సిపల్ చైర్మన్ గా పుల్కం రాజు, వైస్ చైర్మన్ గా నరాల శేఖర్ ఎన్నిక



**ప్రజాపక్షం/వేములవాడ:** వేములవాడ మున్సిపల్ పీఠాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. మున్సిపల్ చైర్మన్ గా పుల్కం రాజు, వైస్ చైర్మన్ గా నరాల శేఖర్ ఎన్నికయ్యారు. సోమవారం ప్రమాణ స్వీకారం అనంతరం భీమేశ్వర స్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు. పట్టణ ప్రజలను ఉద్దేశించి ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడ పట్టణంలో గతంలో ఒక కౌన్సిలర్ నేడు మున్సిపల్ పీఠం కైవశం చేసుకున్నాము. మొన్నటి ఎన్నికలో గత ప్రభుత్వం చేయని పనులు మేము రెండు సంవత్సరాలలో పూర్తి చేసిన పనుల గురించి చెప్తూ ఓటు అడిగాం.వేములవాడ పట్టణ ప్రజలు మేము చేస్తున్న అభివృద్ధి పనులను చూసి మాకు పట్టం కట్టారు.గత ప్రభుత్వంలో వేములవాడ వెనక్కి నెట్టి వేయబడింది.

**మమ్మల్ని ఆశీర్వదించిన ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు...**

మేము గత రెండు సంవత్సరాలలో చేస్తున్న పనులకు ఇది పాస్ మార్కులు ఇచ్చినట్లు అయ్యింది.మాపైన బాధ్యత ఇంకా పెరిగింది.ప్రజలు మా పైన పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయయం.ఎన్నికల సమయంలో మా అభ్యర్థులు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తాం.పట్టణాన్ని అన్ని రంగాల్లో అబివృద్ధి చేస్తాం.రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి దిశగా ముందుకు పోతుంది.గతంలో ఏకైక కౌన్సిలర్ నుండి నేడు మున్సిపల్ పీఠం కైవశం చేసుకున్నాము. వేములవాడ పట్టణ ప్రజలు విజ్ఞులు, పట్టణ అభివృద్ధి కోరుకున్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇంచార్జి మంత్రులు సహకారంతో ముందుకు వెళ్తున్నాం.వేములవాడ మున్సిపల్ పై కాంగ్రెస్ జెండా ఎగురవేయడం సంతోషం. పట్టణ ప్రజల కోసం, ప్రాంతం కోసం ఇచ్చిన హామీలు తప్పకుండా అమలు చేస్తాం.ప్రజలకు అండగా నిలబడతాం. నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ పట్టణ ప్రజలు మాపై పెట్టిన నమ్మకానికి నిరంతరం పట్టణ అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు.

## కోరుట్ల మున్సిపల్ కాంగ్రెస్ కైవసం



**ప్రజాపక్షం/ కోరుట్ల :** కోరుట్ల మున్సిపల్ రాజకీయాల్లో నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది.మున్సిపాల్ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రక్రియలో కాంగ్రెస్ అభ్యర్థులు స్పష్టమైన ఆధిక్యతతో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను దక్కించుకున్నారు.కోరుట్ల మున్సిపాలిటీలో 33 వార్డులకు గాను ఇటీవల జరిగిన ఎన్నికల్లో 18 స్థానాలను గెలుచుకొని అతిపెద్ద పార్టీగా అవతరించిన విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో సోమవారం మున్సిపల్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారుల పర్యవేక్షణలో ఎన్నికల ప్రక్రియ మొదలైంది. మెజారిటీ కౌన్సిలర్ల మద్దతుతో పాటు ఒక స్వతంత్ర అభ్యర్థి కూడా మద్దతు ప్రకటించారు.కోరుట్ల మున్సిపల్ చైర్మన్‌గా తిరుమల వసంత గంగాధర్, వైస్ చైర్మన్‌గా మొహమ్మద్ షహెద్ ఉల్ అహద్ ఎన్నికయ్యారు. రాజకీయ సమీకరణాల దృష్ట్యా ఈ ఎన్నిక అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ జెండా మోసిన కార్యకర్తలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందడానికి జువ్వాడి నరసింగరావు ఈరోజు ఒక సామాన్యమైన కార్యకర్తకు మున్సిపల్ పీఠాన్ని దక్కించారు. కాంగ్రెస్ పార్టీ నిజమైన కార్యకర్తలకు అండగా ఉంటుందని నిరూపించారు.ఈ ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం అనంతరం జరిగిన ఓటింగ్ ప్రక్రియలో కాంగ్రెస్ తన పట్టును నిరూపించుకుంది. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అధికారులు పారదర్శకంగా ఈ ప్రక్రియను పూర్తి చేశారు.కాంగ్రెస్ అభ్యర్థుల విజయం ఖరారు కావడంతో మున్సిపల్ కార్యాలయం వెలుపల పండగ వాతావరణం నెలకొంది పార్టీ కార్యకర్తలు తపాసులు కాల్చి మిఠాయిలు పంపిణీ చేస్తూ సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నూతన మున్సిపల్ చైర్మన్‌గా తిరుమల వసంత గంగాధర్, వైస్ చైర్మన్‌గా మొహమ్మద్ షహెద్ ఉల్ అహద్ మాట్లాడుతూ కోరుట్ల పట్టణ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు.

## అంగరంగ వైభవంగా రథోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం /గొల్లపల్లి :** మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని రాపల్లి ,లోత్తునూరు గ్రామాలతో పాటు మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన శివపార్వతుల రథోత్సవం భక్తులకు కనుల పండుగగా నిలిచింది. ఉత్సవాల ఆఖరి ఘట్టమైన రథోత్సవాన్ని వేలాది మంది భక్తులు భక్తిశ్రద్ధలతో వీక్షించారు.ఆదివారం ఆలయ కమిటీ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో శివపార్వతుల కళ్యాణం,అభిషేకం,స్వామివారికి బిల్వార్చనతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం స్వామివారి దర్శనం అనంతరం మంగళవాయిద్యాల నడుమ రాజరాజేశ్వర స్వామి విగ్రహా ఉత్సవ మూర్తులను రథంపై ఊరేగింపు నిర్వహించారు .శివ దీక్ష స్వాములు మహిళలు భక్తి పాటలతో భక్తులతో కలిసి నృత్యాలు చేస్తూ రథాన్ని లాగుతూ ముందుకు సాగారు . ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి చైర్మెన్ రేగొండ సత్యనారాయణ,గ్రామ సర్పంచ్ లు బుర్ర సుధారాణి భూమయ్య,సర్పంచ్ ఆకుల సుమన్ గౌడ్,పుట్టాపాక సత్యం, పొన్నం స్వామిగౌడ్, మైదాం తిరుపతి, బోనాల రత్నయ్య,ఎన్ లక్ష్మీ కాంతం,బోనాల రాజు,శ్రీనివాస్,తిరుపతి ,యూత్ సభ్యులు శివ దీక్ష స్వాములు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## తాళం వేసిన ఇంట్లో దొంగతనం

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల పరిధిలోని గుంజపడుగు గ్రామంలో ఉదయం తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన సోమవారం చోటుచేసుకుంది.గ్రామానికి చెందిన చుక్క మమత ఇంట్లో దొంగతనం జరిగింది.చుక్క మమత కుటుంబ సభ్యులు సోమవారం ఇంటి నుండి ఉదయం 10 గంటలకు ఇంటికి తాళం వేసి తాళం చెవిని ప్యాంట్ జేబులో వేసి పెంబట్ల దుబ్బ రాజేశ్వర స్వామి ఆలయానికి దర్శనానికి వెళ్లారు .ఆ సమయంలో తాళం వేసి ఉన్న ఇంట్లోకి ప్రవేశించిన గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి బయట ఉన్న ప్యాంట్ జేబులో ఉన్న ఇంటి తాళం చెవిని తీసుకొని ఇంటి తలుపులు తెరిచి స్కూల్ డ్రైవర్ సహాయంతో ఇంట్లో ఉన్న బీరువా తలుపులు తెరిచి అందులో ఉన్న నాలుగున్నర తులాల బంగారాన్ని దోచుకెళ్లారు.దర్శనం అనంతరం వచ్చి ఇంట్లో పరిస్థితిని గమనించి వెంటనే చుక్క మమత పోలీసులకు ఫిర్యాదు చేయగా దొంగతనం జరిగిన ప్రదేశాన్ని ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.